

ఇంటర్ లాకింగ్ పనులు.. తాత్కాలికంగా పలు రైళ్ల రద్దు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గూడూరు సెక్షన్ల మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి - అదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ (17405-17406), తిరుపతి - విశాఖ ఏసీ డబుల్ డక్కర్ (22707 - 22708), గూడూరు-విజయవాడ ఇంటర్ సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12743- 12744) రైళ్ళను రద్దు చేశారు. అలాగే విజయవాడ - బిట్రగుంట ప్యాసింజర్ (67259-67260), విజయవాడ - గూడూరు ప్యాసింజర్ రైళ్లను (67225 - 67226) 13 నంచి 18వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

- గుర్తింపు కార్డు చూపిస్తే చాలు ప్రయాణానికి అనుమతి
- బస్సులకు పూర్తయిన రంగులు, మరమ్మ తులు



స్త్రీ బస్సు రెడీ

రేపటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం

'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. మొత్తం ఐదు రకాల బస్సుల్లో నారీమణులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇందుకుగాను రేషన్ కార్డు/ఓటర్ ఐడీ/ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి కండక్టర్‌కు చూపిస్తే చాలు. ఆయన 'జీరో' టికెట్ ఇస్తారు. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

- నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధమవుతోంది. చేతిలో గుర్తింపు కార్డు ఉంటే చాలు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు ఆర్టీసీ జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. బస్సుల కండీషన్, బస్సులకు రంగులు, డ్రైవర్ల కొరత లేకుండా కాల్‌ఆన్ డ్రైవర్ల నియామకం, జీరో టికెట్‌పై సిబ్బందికి శిక్షణ, మహిళలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. శుక్రవారం నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ఆవరణలో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు ఉచిత ప్రయాణంను ప్రారంభించనున్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఆయా బస్టాండ్లలో ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ఉచిత బస్సు ప్రయాణాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించనున్నారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై జిల్లావ్యాప్తంగా డ్రైవర్లు, కండక్టర్లు, విచారణ కేంద్రంలో ఉండే సిబ్బందికి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని డ్రైవర్లు, కండక్టర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని అధికారులు సూచించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గ్యారేజ్ గేట్ల వద్ద సిబ్బందికి సూచనలు ఇవ్వడంతోపాటు జోనల్ కళాశాలలో ప్రత్యేక ట్రైనింగ్ అందించారు.

కాల్ ఆన్ డ్రైవర్ల నియామకం

ఉచిత ప్రయాణంతో బస్సుల్లో ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తారని భావించిన అధికారులు డ్రైవర్లు కొరత లేకుండా 130 మంది కాల్‌ఆన్ డ్రైవర్లను జిల్లావ్యాప్తంగా తీసుకున్నారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి బస్సులను వారి చేతికి అప్పగిస్తున్నారు. రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో బస్సుల సంఖ్యను బట్టి కాల్‌ఆన్ డ్రైవర్లను తీసుకున్నారు.



సిబ్బందికి సూచనలు అందిస్తున్న షమీమ్

ఘన స్వాగతం పలకండి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణానికి ఘన స్వాగతం పలకాలని జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. నగరంలోని ఆర్టీసీ ఒకటవ డిపో గ్యారేజ్ గేటు వద్ద బుధవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులతో గేట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న షమీమ్ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం ప్రారంభమయ్యాక సర్వీసు కండక్టర్, డ్రైవరు ప్రయాణికులతో సానుకూలంగా స్పందించాలని, ఎటువంటి ఫిర్యాదు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ పరిధిలో బస్సుల సంఖ్య : 642

సొంత బస్సులు : 510
అద్దె బస్సులు : 132
డిపోలు : 7
ఏ డిపోలో ఎన్ని బస్సులు : ఆత్మకూరు 71, కందుకూరు 102, కావలి 98, రాపూరు 50, ఉదయగిరి 73, నెల్లూరు-1 127, నెల్లూరు-2 121,
ప్రయాణికుల సంఖ్య (రోజుకు) : 1.5 లక్షలు
రోజుకు బస్సులు తిరిగే కి.మీ : 2,35,861
రాబడి (రోజుకు) : రూ.95లక్షలు
ప్రస్తుతం మహిళలు ప్రయాణిస్తున్న శాతం : 40
ఉచితం అమలైతే పెరిగే అంచనా : 80



ఉలవపాడు : కాపు మీదున్న పునాస చెట్లు

కూల్.. కూల్!

- జిల్లాలో చల్లబడ్డ వాతావరణం
- రోజంతా చిరుజల్లులు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. మొన్నటిదాకా భానుడి భగభగలతో అల్లాడిన ప్రజానీకం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకుంది. కాగా, బుధవారం నెల్లూరుతోపాటు ముత్తుకూరు, రాపూరు, కందుకూరు తదితర ప్రాంతాలలో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలో సగటు వర్షపాతం 2 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 12.4, అత్యల్పంగా రాపూరులో 0.4 మి.మీ వర్షం కురిసింది. గురు, శుక్రవారాలలోనూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.



ఉద్యాన పంటలకు మేలు

ఉలవపాడు : వాతావరణం చల్లబడటంతోపాటు రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో ఉద్యాన పంటలకు మేలు జరిగినట్టు అయ్యింది. వేసవిని తలపిస్తూ ఎండలు మండిపోవడంతో ప్రజలతో పాటు ఉద్యాన పంటలు తట్టుకోలేకపోయాయి. మామిడి, సపోటా చెట్లు బెట్ట దెబ్బకు వాడు ముఖం పడతున్నాయని మోటారు బోర్లతో రైతులు నీళ్లు కట్టుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే, రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో భూమి చల్లబడింది. భూమిలో కొద్దిపాటి తేమ చేకూరడంతో మామిడి, సపోటా చెట్లకు ఊతం ఇచ్చినట్లు అయింది. ప్రస్తుతం మండలంలో 2వేల ఎకరాలలో పునాస పూత, పిందె, అక్కడక్కడ కాయ దశలో ఉంది. గత జూన్ ఆఖరితో మామిడి సాగు పూర్తికావడంతో ఇప్పుడు పునాస కాపు అందుబాటులోకి వచ్చింది. తేలికపాటి వర్షంతో భూమిలో తేమ పునాస చెట్లకు, కాపునకు మేలు చేసినట్లు అయిందని రైతులు అంటున్నారు. అదేవిధంగా మన్నేరు కాలువ పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న జామ తోటలకు కూడా మేలు చేసినట్లు అయింది. అలాగే, సరుగుడు, జామాయిల్ సాగుకూ నీరు కట్టే బాధ తప్పినట్లు అయింది.

ఆ రెండూ

ఇక అంతేనా!?

ఇన్‌చార్జుల పాలనలో నెల్లూరు, కావలి ఇరిగేషన్ డివిజన్లు

- ఈఈల నియామకంలో రాజకీయ అడ్డంకులు

నెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతి పెద్ద ఇరిగేషన్ డివిజన్ అయిన నెల్లూరు సెంట్రల్ డివిజన్, కావలి డివిజన్లు ఇన్‌చార్జ్‌ల పాలనలో కునారిల్లుతున్నాయి. పెన్నా డెల్టా మొత్తం ఈ రెండు డివిజన్ల పరిధిలోనే ఉండగా, వీటికి రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లేరు. మూడు లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ డివిజన్లకు రెగ్యులర్ అధికారులను నియమించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఈ ప్రభావం అంతిమంగా రైతాంగంపై పడుతోంది. ఇటీవల బదిలీల్లో ఈ రెండు డివిజన్లకు రెగ్యులర్ ఈఈలను నియమించేందుకు ప్రయత్నాలు జరిగినా రాజకీయ కారణాలతో అవి కార్యరూపం దాల్చలేదు. డివిజన్ పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు చాలా కీలకమైనది. క్షేత్రస్థాయి సమస్యలన్నీ ఈయన ఆధ్వర్యంలోనే పరిష్కరించాల్సి ఉంటుంది. నెల్లూరు సెంట్రల్ డివిజన్ ప్రధానమైనది. నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాలు పూర్తిగా ఈ డివిజన్ పరిధిలో ఉంటాయి. ఈ డివిజన్‌కు ప్రభుత్వం ఎప్పుడూ రెగ్యులర్ ఈఈనే నియమిస్తూ ఉంటుంది. ఈ ఏడాది మే వరకూ ఈఈగా నాగరాజు కొనసాగారు. ఆయన పదవీ విరమణ చేశాక ఆ స్థానంలో మరొకరిని నియమించలేదు. ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు పోస్టులను చూసుకోవడం కష్టంగా మారింది. అలానే కావలి ఈఈగా ఉన్న కృష్ణమోహన్ గతేడాది అక్టోబరులో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలను కావలి డీఈఈ ఖాన్‌కు అప్పగించారు. ఈ రెండు డివిజన్లకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కొందరు ఈఈలు ప్రయత్నాలు చేశారు. అప్పటికే పలువురు డీఈఈలకు ఈఈలుగా ఉద్యోగోన్నతి లభించడంతో సెంట్రల్ డివిజన్, కావలి డివిజన్లకు రెగ్యులర్ ఈఈలను నియమించడం ఖాయంగా ఇరిగేషన్ ఉద్యోగులు భావించారు. ఈ క్రమంలోనే కొందరు ఈఈలు స్థానిక ఎమ్మెల్యేల వద్ద సిపార్సు లేఖలు కూడా తీసుకున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు ఓ అధికారిని, మరికొందరు ఇంకో అధికారిని కోరుకోవడంతో రెగ్యులర్ అధికారుల నియామకం కొలిక్కి రాలేదు. రెగ్యులర్ ఈఈలు లేకుండానే రెండో పంట సాగు పూర్తయింది. ఈ సమయంలో సాగునీటి పంపిణీలో అనేక సమస్యలు తలెత్తాయి. సరైన పర్యవేక్షణ లేని కారణంగా కొన్ని కాలువలకు ఎక్కువగా నీరు వదిలేయగా, మరికొన్నింటికి తగ్గించారు. రైతులు గోల చేయడంతో అది ఎమ్మెల్యేలకు కూడా ఇబ్బందిగా మారింది. అక్టోబరు నుంచి కీలకమైన రబీ సాగు మొదలవుతుంది. ఈ సమయంలో ఓఅండ్‌ఎం పనులు చేపట్టాల్సి ఉంది. మరి ఆలోపు రెగ్యులర్ ఈఈలను నియమిస్తారో లేదో చూడాలి.



ఆశా కార్యకర్తకు మిఠాయి తినిపిస్తున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

- పూర్తివేతనంతో 6నెలల ప్రసూతి సెలవులు
- ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- రిటైర్డు అయ్యాక నెలకు రూ.5వేల గ్రాట్యూటీ
- జిల్లాలో 1,885 మంది ఆశాలకు మేలు

ఆశాలకు వరాల జల్లు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంతో పాటు పలు రకాల రాయితీలు కల్పిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగినుల తరహాలో 6 నెలలు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేశారు. అయితే, ఈ కాన్పుల సెలవులు రెండు ప్రసవాల వరకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచటంతో ప్రభుత్వం నిర్ణయంపై ఆశాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఉత్తర్వులు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ ఏప్రిల్ నుంచే ఉత్తర్వులు అమలవుతాయని ప్రభుత్వం ప్రకటిస్తే ఈలోగా ఉద్యోగ విరమణ చేసిన వారు తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంటుంది.

గ్రాట్యూటీ రూపంలో నెలకు రూ.5వేలు

జిల్లాలో 1,885 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారు. వీరంతా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మాతాశిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను ప్రోత్సహించటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలతోపాటు పలు కీలక పనులు క్షేత్రస్థాయిలో చేపడుతుంటారు. వీరికి నెలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7200, కేంద్ర ప్రభుత్వం రూ.2,800 చొప్పున వేతనాల రూపంలో అందుతోంది. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తల ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భరోసా కల్పించేందుకు గౌరవ వేతనంలో సగం మొత్తాన్ని అంటే కొత్తగా గ్రాట్యూటీని నెలకు రూ.5 వేలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించింది. గరిష్ఠంగా 1.50 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గ్రాట్యూటీ చెల్లింపునకు కనీస సర్వీసు కాలాన్ని ప్రామాణికంగా తీసుకుంటారా!? అందరికి సమానంగా వర్తింప చేస్తారా అనేది స్పష్టత ఇవ్వాలి ఉంది. కాష్త రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై బుధవారం ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ సంబరాలు చేసుకుంది. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆశాలకు స్వీట్లు పంచిపెట్టారు.

ఆశాలకు గుర్తింపు



ఆశాల సమస్యలు పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. గత మార్చి 6వ తేదీన చలో విజయవాడ వంటి కార్యక్రమాలూ చేపట్టాము. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించటం శుభపరిణామం. ఆశా కార్యకర్తల భవితవ్యం ఎంతో మెరుగుపడుతుంది. తద్వా రా ఆశాల శ్రమకు తగిన గుర్తింపు కూడా వస్తుంది. అలాగే ఆశాల వేతనాలు కూడా పెంచాల్సి ఉంది.


- దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రసూతి సెలవులతోపాటు ఎన్నో రాయితీలు




ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆశాల కృషి ఎంతో ఉంది. అలాంటి మాకు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు కేటాయించటం ఎంతో ఆనందంగా ఉంది. ఉద్యోగులతో సమానంగా మాకు అవకాశం కల్పించారు. అలాగే ఆశాల ఉద్యోగ వయోపరిమితిని పెంచటం కూడా ఎంతో ఆనందంగా ఉంది.

- విజయలక్ష్మి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



'సోమశిల'కు 23,088 క్యూసెక్కుల వరద

అనంతసాగరం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. బుధవారం 23,088 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 41.954 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,850, వరద కాలువకు 7,200, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. పెన్నాపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కడప జిల్లా సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు ఇంజనీరు చెబుతున్నారు. గురువారం సాయంత్రంకు వచ్చే వరద 30 వేల క్యూసెక్కులు దాటవచ్చని అంచనా వేస్తున్నారు.



మనుబోలు దళితవాడలో అంగీకారపత్రాలు సేకరిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

దళిత, గిరిజనులకు సోలార్ కరెంట్

- అంగీకారపత్రాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

మనుబోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దళిత, గిరిజన కుటుంబాలకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్‌పవర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం విద్యుత్‌శాఖ సిబ్బంది మనుబోలులోని దళితవాడలో అంగీకార పత్రాలు సేకరించారు. దీనిపై ఏఈ అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఈ ఆదేశాల మేరకు దళిత, గిరిజనుల ఇళ్లపై సోలార్‌పలకలు అమర్చేందుకు అంగీకరిస్తున్నట్లు రాతపూర్వకంగా తీసుకుంటున్నామన్నారు. మండలంలో 1880 మంది దళితులు, 520 మంది గిరిజనులు ఈ పథకం కింద లబ్ధిపొందనున్నట్లు ఇది వరకే గుర్తించామన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం ఇందులో ఎంతమంది అర్హులవుతారో చూడాలన్నారు. పూర్తి వివరాల కోసం విద్యుత్ సిబ్బందిని లేదా విద్యుత్ కార్యాలయానికి వస్తే అవగాహన కల్పిస్తామన్నారు.

పట్టపగలే దారుణం
కత్తులతో విచక్షణ రహితంగా దాడి
నెల్లూరులో యువకుడి హత్య
స్నేహితుడే హంతకుడు!
వివరాలు 8 లో..



కేంద్ర ప్రభుత్వ పథకాలకు

క్షేత్రస్థాయిలో ప్రచారం చేయండి

- కార్యకర్తల్లో అసంతృప్తి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు నగరానికి చేరుకున్న మాధవ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత వేదాయపాలెం సెంటర్‌లో చాయ్ పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరితో మమేకం అయ్యారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద శ్రీ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత వీఆర్సీ కళాశాల నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు జరిగిన శోభయాత్రలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. కళాక్షేత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో

- మిగతా 7లో...

భూసమస్యలపై రోజుల తరబడి తిప్పుకుంటున్నారు

మనుబోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రోజుల తరబడి రెవెన్యూ సిబ్బంది సమాధానం చెప్పకుండా తిప్పుకుం టున్నారని జట్లకొం డూరుకు చెందిన చీకటి సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగ ళవారం తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని చీకటి సుధాకర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిని ఆయన ఖండించారు. తా నేమి విధులకు ఆటంకం కలిగించలేదని, తనకున్న భూ సమస్యలపై రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, ఎంతవరకు పరిష్కరించారని ప్రశ్నించా నన్నారు. అందుకు తనపై ఫిర్యాదు చేశారని చీకటి తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9588
వెండి కిలో ధర	రూ. 118700
వెండి ఒక గ్రాము	రూ. 121.70

అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోండి

కోవూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : పడుగుపాడు, కోవూరు, పోతిరెడ్డిపాళెం గ్రామ పంచాయతీల పరిధిలోని అనధికార లే అవుట్లను అక్టోబరు 25లోగా క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య కోరారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లే అవుట్లకు అనుమతులు లేకుంటే అక్టోబరు 25 తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార లే అవుట్లలోని ప్లాట్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తించని రైతులు వీఆర్వోలను కలిసి వివరాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వరి విత్తనాల సేకరణపై నేడు సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే వరిధాన్యాన్ని వరి విత్తనాల కోసం సేకరించేందుకు గురువారం రాష్ట్ర వరి విత్తన కేంద్రం అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం లోని పవ్వేరు బ్యాంకులో రైతులతో సదస్సు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధి కారి శ్రీహరి బుధవారం ప్రకటనలో తెలిపారు.

శ్మశాన వాటిక రహదారికి నిధుల మంజూరు

పొదలకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పరిధిలోని లింగంపల్లి ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక రహదారికి రూ.10లక్షల పంచాయతీ నిధులు మంజూరయ్యాయి. ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటికకు రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈనేపథ్యంలో లింగంపల్లి గ్రామ టీడీపీ నాయకుడు డేగ యశ్వంత్‌రెడ్డి కృషి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో సిమెంటు రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. ఈనేపథ్యంలో బుధవారం పంచాయతీ రాజ్ డీఈ చంద్రశేఖర్, ఏఈ రాజశేఖర్ శ్మశాన రోడ్డును పరిశీలించారు. దీంతో లింగంపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వెంకటాచలంలో వర్షం

వెంకటాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం దాదాపు అన్ని గ్రామాల్లో వర్షపు జల్లులు కురిసాయి. ఈ ఏడాది ఎండల తీవ్రత వల కొన్ని గ్రామాల్లో భూగర్భజాలాలు అడుగంటిపోయాయి. భారీ వర్షాలు కురవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండు సమీపంలో సర్వేపల్లి కాలువలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. 30 నుంచి 35 ఏళ్లలోపు యువకుడు మృతి చెందాడని, మృతదేహంపై ఎరుపు రంగు హాఫ్‌హ్యాండ్స్ టీషర్ట్, బ్లాక్ లోయర్ ఉన్నాయని తెలిపారు. మృతదేహం ఉబ్బి దుర్గంధం వెదజల్లుతుం డటంతో మరణించి రెండు రోజులై ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440796306 నెంబరుకు తెలియ జేయాలని ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

తల్లీకుమారుడి అదృశ్యం

నెల్లూరు(క్రైం): తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటనపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని భక్తవత్సల నగర్‌లో ప్రకాష్ కుటుంబం నివసిస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ నెల 4వ తేదీన భార్య, చిన్నకుమారుడు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినా జాడ తెలియక పోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజన్ వచ్చేసింది!

- తస్మాత్ జాగ్రత్త అంటున్న వైద్యులు
- ప్రబలుతున్న వైరల్ జ్వరాలు
- జిల్లాలో 10వేలకుపైగా కేసుల నమోదు
- నిండుకుంటున్న ఆసుపత్రులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి.దీంతో జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్‌లు ఎక్కువవుతున్నాయి. డెంగ్యూ, టైఫాయిడ్ జ్వర పీడితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. పైగా జిల్లాలో వర్షాలు పడుతుండటంతో నీరు కూడా కలుషితమై వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయి. ఏ గ్రామంలో చూసినా జ్వరాలు నమోదుకాని పరిస్థితే లేదు. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యులను ప్ర రోజూ పదుల సంఖ్యలో జ్వరపీడితులు కలుస్తూ చికిత్స చేయించు కుంటున్నారు.

● ప్రతి ఆసుపత్రిలో బాధితులే..

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా, గత వారం లో వాటి పరిధిలో 300 మందికిపైగా జ్వరాల బాధితులు వచ్చినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు, నెల్లూరులోని జీజీహెచ్‌లో రోజూ 2వేలకు మందికి పైగా వివిధ రకాల రోగులు వస్తుండగా ఇందులో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో 2వేలకు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా అక్కడకు వచ్చే రోగులో జ్వరపీ డితుల సంఖ్య ఆందోళన కలిగిస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 26 లక్షల మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 10వేలకు మందికి పైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దోమల వల్ల కూడా ఎక్కువగా టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ప్రతి వారం రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగే వీడియా కాన్ఫరెన్స్‌లోనూ జిల్లాలో జ్వరాల ప్రభావంపై అధికారులకు హెచ్చరికలు జారీచేస్తున్నారు.

● జ్వరం, గొంతు నొప్పి కేసులే ఎక్కువ..

జిల్లా వ్యాప్తంగా విజృంభిస్తున్న జ్వరాలలో ఎక్కువగా జ్వరాలతోపాటు గొంతు నొప్పి కేసులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు ఒళ్ళు నొప్పులు, దగ్గు, జలుబు కేసులు కూడా ఉన్నాయి. అలాగే టైఫాయిడ్ కేసులు కూడా ఎక్కువగా ఆయా ఆసుపత్రులకు వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వాతావరణంలో వస్తున్న మార్పులు, పారిశుధ్య లోపంతోపాటు నీటి కలుషిత కారణంగా కూడా వైరల్ ఫీవర్‌లు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షంలో తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రత్యేకించి చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా వైరల్ జ్వరాలకు గురవుతున్నారు. చిన్నపాటి దగ్గు, జలుబు వచ్చినా అది వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైరల్ జ్వరాలు రాకుండా మాస్కులు, చేతిరుమాలు అడ్డం పెట్టుకోవాలి. జ్వరం కారణంగా కండరాల నొప్పులు కూడా వస్తున్నాయి.

జ్వర బాధితులు ఎక్కువే..



జీజీహెచ్‌కు వచ్చే రోగులలో జ్వర పీడితులు అధికంగానే ఉన్నారు. ప్రస్తుతం సీజన్ కావటంతో జ్వరపీడితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. టైఫాయిడ్ కేసులు కూడా జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తప్పని సరిగా జ్వరాలకు సంబంధించి, అన్నీ రకాల పరీక్షలు చేయించుకుంటే, అది ఎలాంటి వైరల్ ఫీవరో తెలుస్తుంది. దీనికి అనుగుణంగా వైద్య చికిత్సలు అందిస్తున్నాం.

- డాక్టర్ గంగాధర్, జీజీహెచ్, అసోసియేట్ ప్రొఫెసర్

గొంతు నొప్పిని నిర్లక్ష్యం చేయవద్దు



వైరల్ జ్వరాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. దీని వల్ల గొంతు నొప్పితోపాటు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలి. బయట ఆహారం తీసుకోరాదు. చిన్నపిల్లల, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు



నెల్లూరుకు బయలుదేరి వెళుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరుకు తరలిన బీజేపీ శ్రేణులు



వెంకటాచలం: నెల్లూరుకు బయలుదేరి వెళ్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం జిల్లా పర్యటనకు రావడంతో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుచ్చిరెడ్డిపాళెం నుంచి బీజేపీ రూరల్ అధ్యక్షుడు సిద్ధన మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. అలాగే బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు తదితరులు నెల్లూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు.

వెంకటాచలం: జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విచ్చేయడంతో మండలంలోని బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి ఆరుముళ్ల మురళీ ఆధ్వర్యంలో చవటపాళెం నుంచి బీజేపీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఆటోలలో నెల్లూరుకు వెళ్లారు. అలాగే బీజేపీ జిల్లా నేతలు కుంచి శ్రీనివాసులు యాదవ్, అల్లూరు ప్రసాద్‌నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు, బీజేపీ నేతలు గోతల నరేష్, కరీముల్లా, షేక్ జిలాని తదితరుల ఆధ్వర్యంలో కూడా నెల్లూరుకు ఆపార్టీ నేతలు భారీగా తరలివెళ్లారు.

ఘనంగా బీజేపీ జెండా ఆవిష్కరణ



మనుబోలులో బీజేపి జెండాను ఆవిష్కరిస్తున్న మండలాధ్యక్షుడు వాసిరెడ్డి రామిరెడ్డి

మనుబోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన సందర్భంగా బుధవారం మనుబోలులో జాతీయరహదారి పక్కన బీజేపి జెండాను ఆ పార్టీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వాసిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను బీజేపి పెద్దల దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం నెల్లూరు పర్యటనకు మండలం నుంచి వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బోలా శ్రీనువాసులు, మాజీ మండలాధ్యక్షుడు పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి, శూలమయ్య తదితరులు పాల్గొన్నారు.

టెట్ మార్కులతో డీఎస్సీ స్కోర్ కార్డులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025కి సంబంధించి గతంలో విడుదల చేసిన తుది కీతోపాటు స్కోర్ కార్డులను సవరించి టెట్ మార్కులతో డీఎస్సీ స్కోర్ కార్డులను విడుదల చేసినట్లు డీఈవో బాలాజీ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలన అనంతరం టెట్ మార్కులతో అను సంధానం చేసిన స్కోర్ కార్డులను ఏపీడీఎస్సీ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని తెలిపారు. టెట్ మార్కుల స్కోర్ కార్డులో ఏదైనా అభ్యంతరాలుంటే అభ్యర్థి ఐడీ నెంబర్ ద్వారా వెబ్‌సైట్‌లో తమ వివరాలను తామే సరిచేసుకోవాలని సూచించారు. దీనికోసంగా గురువారం సమయం కేటాయిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు అదనపు నోటిఫికేషన్

నెల్లూరు(విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో 25శాతం సీట్లు పేద పిల్లల కోసం కేటాయిస్తున్న నేపథ్యంలో ఖాళీ సీట్ల భర్తీకి అదనపు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు ఈనెల 20వతేదీ లోపల సీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

రైతులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



ఇనమడుగులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారి రజని

కోవూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు పొందని రైతులు తమ బ్యాంకు అకౌంటుకు ఆధార్ నెంబరును అనుసంధానం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి టీ.రజని కోరారు. మండలంలోని వేగూరు, ఇనమడుగు గ్రామ పొలిమేరల్లోని పొలాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీఎస్‌డబ్ల్యూ సర్వేలో నమోదు కాని రైతులు సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వరి సాగు చేసే ప్రతీ రైతు తమ పైరును 'ఈ-పంట'లో నమోదు చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పు వల్ల వరి గింజలో రంగు మారుతోందన్నారు. దీని నివారణకు ప్రోపికొనుజైల్ ద్రావణాన్ని పొలంలో పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శిరీష, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

- 20 నుంచి ఒంగోలులో రాష్ట్ర మహాసభలు
- పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య



రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని షాదీ మంజిల్‌లో ఈ నెల 17 నుంచి మూడు రోజులు సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయా లని పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగో లులో జరుగుతాయని పేర్కొన్నారు. దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్స రాలు పూర్తి చేసుకుందని, ప్రజాసమ స్యలపై నిర్మాణాత్మక పోరాటం సాగిస్తోందని తెలిపారు. ప్రతీ మూడే ళ్లకు ఒకసారి మండలం, నియో జకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి మహాసభలు జరపడం ఆనవాయితీ అన్నారు. జిల్లా మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ నాయకుడు రావుల అంకయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజర వుతా రని తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, మధు, షాన్‌వాజ్, శిరీష, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌తో వినియోగదారుల సమస్యల పరిష్కారం



వినియోగదారుడి సమస్యకు జవాబు ఇస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

పొదలకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదాలత్‌ల ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ వి శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. బుధవారం పొదలకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. రూరల్ డివిజన్ పరిధిలోని రాపూరు, నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు, సబ్‌డివిజన్ పరిధిలోని రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, కలువాయి, నెల్లూరురూరల్, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాలతో పాటు విరువూరు, కోడూరు, వెంకటాచలం, కావేరినగర్, సెక్షన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈ అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ వి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, సభ్యురాలు విజయలక్ష్మీ, ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్, నెల్లూరు రూరల్ డివిజన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి పాల్గొని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. 18 అర్జీలు వచ్చాయి. ఇందులో ప్రధానంగా అధిక మొత్తంలో బిల్లులు రావడం, లోవోల్టేజ్ సమస్యలు, పాత విద్యుత్ వైర్లు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ వి.శ్రీనివాస్ ఆంజనేయమూర్తి మాట్లాడుతూ పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనప్పుడు సంబంధిత ఏఈకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారని, ఎఫ్ఐఆర్ ద్వారా నూతన ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు అమర్చుకుంటే బిల్లులు అధికంగా వస్తున్నాయనేది అపోహ మాత్రమేనన్నారు. పవర్ ఆఫ్ చేసినప్పుడు కెపాసిటర్ ఆఫ్‌లోనే ఉండాలన్నారు. స్థానిక టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, కోడూరు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 20 ఏళ్ల కిందట నాటిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు అమర్చారు. కానీ వాటికి విద్యుత్ తీగలను మార్చలేదన్నారు. అలాగే అవసరమైన చోట నూతన స్తంభాలు త్వరితగతిన ఏర్పాటు చేయాలని విన్నవించారు. రెండేళ్ల కిందట మండలంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేసే సమయంలో పలు అవకతవకలు జరిగాయని, వాటిని పునఃపరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పొదలకూరు ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీనివాస్, ఆయా మండలాల డిస్కం అధికారులు, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనాస్థలిలో సయ్యద్ అన్వర్‌బాష మృతదేహం

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాశిలి వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వాశిలి గ్రామానికి చెందిన సయ్యద్ అన్వర్ బాష(55) వాశిలి బస్టాండ్ సెంటర్ వద్ద జాతీయ రహ దారి రోడ్డు మార్జిన్‌లో టీవీఎస్ మోపెడ్ వాహనంపై కూర్చొని ఉండగా నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కారులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ జిలానీ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జిలాని తెలిపారు. మృతుడు అన్వర్‌బాష బేల్దారు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలీసుల అదుపులో బాల నేరస్థుడు

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ఓ బాల నేరస్థుడిని అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10వ తేదీ రాత్రి ఏఎంసీ కార్యాలయంలో కంప్యూటర్లు, ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా పట్టణంలోని షబ్బీర్ కాలనీకి చెందిన ఓ బాల నేరస్థుడు చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని సామగ్రిని రికవరీ చేశామన్నారు. ఈమేరకు నిందితుడిని జువైనల్ కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

కాలువలో కారు బోల్తా

- పలువురికి స్వల్ప గాయాలు



అదుపుతప్పి కాలువలో పడిపోయిన కారు

మర్రిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలో బోల్తాపడిన సంఘటన పొంగూరు గ్రామం వద్ద బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు ప్రాంతానికి చెందినవారు అనంతసాగరం మండలం గౌరవరంలో తమ బంధువుల పెళ్లికి వెళ్తుండగా పొంగూరు గ్రామ సమీపంలో ఉన్న పెద్ద మలుపు వద్ద కారు అదుపు తప్పి కాలువలో పడింది. కారులో ఉన్న వారు అంతా ఒకే కుటంబానికి చెందిన వారు కాగా, వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా



రోడ్డుపై పడిపోయిన లారీ

మర్రిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన నెల్లూరు-కడప సరిహద్దులో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. కోళ్లను రవాణా చేసే ఖాళీ లారీ దుత్తలూరు నుంచి బద్వేలు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

రెండు ఆటోల ఢీ : ఇద్దరికి గాయాలు

సంగం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై వెంగారెడ్డిపాళెం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు బుధవారం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు... మండలంలోని కోలగట్లకు చెందిన కాకర్ల కృష్ణవేణి అనే మహిళ ఆటోలో బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుండగా మార్గమధ్యంలో వెంగారెడ్డిపాళెం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో కాకర్ల కృష్ణవేణికి తీవ్ర గాయమైంది. అదేవిధంగా మరో ఆటోలోని దినేష్ అనే యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైనవారిని చికిత్స నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- కాపాడిన పోలీసులు



శ్రీనివాసులును అదుపులోకి తీసుకొన్న పోలీసులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడు పంచాయతీ హుస్సేన్‌నగర్‌కు చెందిన కొమరగిరి శ్రీనివాసులు అనే వ్యక్తి తూర్పుబోయమడగల గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి తన భార్య మాట వినడం లేదని మనస్థాపం చెందాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు 112 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేసి స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ రఘునాథ్ స్గిగల్స్ ఆధారంగా సిబ్బందితో గాలింపు చేపట్టారు. చివరికి అలివేలుమంగాపురం గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో అతన్ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటసుబ్బయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
కోడిగుడ్ల ధర (100):	520



చట్ట వ్యతిరేక జీవోలు రద్దు చేయాలి : పీడీఎస్‌యూ నిరసన

నెల్లూరు(విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలను రానీయకుండా ప్రవేశపెట్టిన చీకటి జీవోలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో జీవోలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోగా వీటిపై ప్రశ్నిస్తున్న సంఘాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకుని ఈ జీవోను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

రేపు లక్ష కుంకుమార్చన

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు లక్ష కుంకుమార్చన జరుగుతుందని ఆలయ పాలక మండలి ఓ ప్రకటనలో తెలిపింది. పాల్గొన్న భక్తులకు లక్ష్మీదేవి అమ్మవారి వెండి కాసు, పసుపు కుంకుమ, రవిక, గాజులు ఇస్తారని, భక్తులు అందరూ తరలిరావాలని కోరింది.

ఆంధ్ర కేసరి జయంతికి ఏర్పాట్లు చేయండి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి ఈనెల 23న రాష్ట్ర పండుగగా జరుగుతుందని మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం నగరంలోని కూరగాయల మార్కెట్ ఎదుట గల ప్రకాశం కాంస్య విగ్రహం వద్ద ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు.

సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి

● ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియాజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలని ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో కోరారు. జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పడిన నేపథ్యంలో సర్వేపల్లిని గూడూరు జిల్లాలో కలుపుతారనే ప్రచారం ఉందని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పలు వేదికలపై కోరారన్నారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. సర్వేపల్లిని గూడూరు జిల్లాలో కలిపితే కృష్ణపట్నం పోర్టు, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపితే రామాయపట్నం పోర్టు వెళ్లిపోతాయని తెలిపారు. అదే జరిగితే నెల్లూరు ప్రజలకు నారేత వేసుకోవడం, వరికోత కోసుకోవడమే మిగులుతాయని పేర్కొన్నారు.

'యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలి'

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యానాదుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాది రిజర్వేషన్ పోరాట సమి తి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో బుధవారం వివిధ జిల్లాల యానాది సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ సాధన కోసం త్వరలో విజయవాడలో యానాది గర్జన కార్యక్రమాన్ని, బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యపై స్టిక్కర్ల ఆవిష్కరణ



నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పేదరికాన్ని పార ద్రోలేది చదువు మాత్రమే అన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచనలతో కూడిన స్టిక్కర్లను విశ్రాంత డీఐజీ చౌటూరు వెంకటేశ్వర్లు బుధవారం నగ రంలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు, తలపల వేణుగోపాల్, శ్రీరాములు, సుధాకర్‌రావు, మోహన్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జేసీతో డీసీసీబీ చైర్మన్ భేటీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి బుధవారం జేసీ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పలు అంశాలు చర్చించారు.



సమగ్ర ఆదాయం

● నగరంలో సర్వేతో ఇంటింట కొలతలు ● భవనాలన్నీ పన్ను పరిధిలోకి...
● భారీగా పెరగనున్న ఆస్తి పన్ను ● అనధికార కొళాయిల తొలగింపు
● బయటపడుతున్న వ్యత్యాసాలు ● నూతన పన్నులతో ప్రజల అవాక్కు

● నగరంలో దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌కు కార్పొరేషన్ అధికారులు 1031035050 నెంబరుతో అసెస్‌మెంట్ విధించి రూ. 25 వేలు మాత్రమే ఆస్తి పన్ను వసూలు చేస్తూ వచ్చారు. కానీ తాజాగా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేతో ఆ క్లబ్ భవన నిర్మాణాల పూర్తి విస్తీర్ణాన్ని లెక్కకట్టగా పన్ను రూ.3.05 లక్షలకు పెరిగింది. ఇక నుంచి ఈ మొత్తం చెల్లించాలని నగర పాలక సంస్థ డిమాండ్ నోటీసు విడుదల చేసింది.

● జడ్పీ కార్యాలయానికి ఎదురుగానున్న సెయింట్ జోసఫ్ స్కూల్‌కు 1031041707 నెంబరుతో అధికారులు అసెస్‌మెంట్ విధించి ఇప్పటి వరకు రూ.73,241లు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఇటీవల చేపట్టిన సమగ్ర సర్వేతో ఆ పాఠశాల పన్ను రూ.2.23 లక్షలకు పెరిగింది.

ఈ విధంగా సమగ్ర సర్వేతో పన్ను లెక్కల్లో భారీ వ్యత్యాసం వచ్చింది. నూతన కొలతల ప్రకారం పన్నులు వసూలు చేస్తే నగర పాలక సంస్థకు ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది.



వ్యాపార భవనం కొలతలు తీస్తున్న అధికారులు



అనధికార కొళాయి కనెక్షన్ తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

నెల్లూరు(సిటీ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో చేపట్టిన సమగ్ర సర్వేతో నెల్లూరు నగరంలో ఆస్తి పన్నుల లెక్కలు గణనీయంగా పెరగనున్నాయి. రాష్ట్రంలోని అన్నీ మున్సిపాలిటీల్లో ఉన్న భవనాలకు కొలతలు తీసి, వాటి ప్రకారం తాజాగా పన్నులు విధించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఖాళీ స్థలాల పన్ను, కొళాయిలు, భవనం ప్లాన్‌ను కూడా పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు గతేడాది నవంబరులో సర్వే ప్రారంభమైంది. స్థానిక సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి సర్వే పూర్తి చేశారు. ఇందులో అనేక విశేషాలు వెలుగుచూశాయి. అనధికార కట్టడాలు, అవినీతితో జారీ చేసిన ప్లాన్లు, అక్రమంగా కొనసాగుతున్న కొళాయిలు బయటపడ్డాయి. ఇదంతా ఒక ఎత్తయితే పెద్ద పెద్ద భవంతులకు స్వల్పంగా పన్ను విధిస్తున్న విషయం వెలుగులోకి రావడం మరోఎత్తు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 63.51 కోట్లు (నికర పన్ను) వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రెవెన్యూ విభాగం 2024-25లో ఆ మొత్తాన్ని రూ. 73.93 కోట్లకు పెంచింది. సమగ్ర సర్వే నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. 85.50 కోట్లకు లక్ష్యాన్ని పెంచుకుంది. ఇక, ఖాళీ స్థలాల పైన విధించే పన్నులపైనా సర్వే మొదలైన విషయం విదితమే. వీటికి సంబంధించి గతేడాదిలో రూ. 6.61 కోట్లు లక్ష్యంగాకాగా, తాజా ఏడాదిలో రూ. 6.70 కోట్లుగా నిర్ణయించారు.

● పన్ను పరిధిలోకి భవనాలన్నీ....

కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు 2023వ సంవత్సరంలో 2,924 కొత్త అసెస్‌మెంట్లను గుర్తించి రూ.1.64 కోట్లు పన్నుగా విధించారు. అదే ఏడాది 2,600 భవనాలకు రూ.3.39 కోట్లుగా కొనసాగుతున్న పన్నులో తాజా విస్తీర్ణాలను బట్టీ పెంపుదల చేశారు. 2024లో 1934 నూతన భవనాలకు రూ. 87 లక్షలు మాత్రమే కొత్తగా పన్ను పెంచారు. ఇక, ప్రస్తుత సంవత్సరంలో సర్వే ఆధారంగా 2,600 కొత్త భవనాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు రూ.1.89 కోట్లు పన్ను పెంచారు. కాగా, ప్రస్తుతం ఉన్న 6,120 భవనాలకు విస్తీర్ణాలు లెక్కకట్టి ఏకంగా రూ.14.29 కోట్లు పన్ను వాటిపై అదనంగా విధించారు. ఇలా సర్వే చేపట్టిన అధికారులు ప్రతీ భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకువచ్చారు.

● అనధికార కొళాయిలు

నగరంలోని 54 డివిజన్ల పరిధిలో అధికారికంగా ఉండే కొళాయి కనెక్షన్లు సుమారు 10 వేలు. అనధికారిక కనెక్షన్ల సంఖ్య ఎన్నో వేలల్లో ఉంది. ఇంటింటా సర్వే ఆధారంగా ప్రతీ కొళాయిని లెక్కకట్టిన సర్వే బృందాలు అనధికార కొళాయిల వివరాలు ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. వీటిని క్రమబద్ధీకరించుకోవాలని ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అప్పటికీ స్పందించకపోవడంతో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు కొళాయి కనెక్షన్ తొలగించే ప్రక్రియ మొదలు పెట్టారు. వీటితోపాటు భవనాల లెక్కలు తీసిన సర్వే బృందాలు, రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ వినియోగంలో ఉన్న అనేక భవనాలను గుర్తించినట్లు తెలిసింది. వీటి లెక్కలను సిటీప్లానింగ్ విభాగానికి అందించినట్లు సమాచారం. పక్కా లెక్కలతో నగర పాలక సంస్థకు ఆదాయం పెరగడం బాగానే ఉన్నా తాజా పన్నులు చూసి నగర వాసులు అవాక్కవుతున్నారు.

చిరుజల్లులతో పులకింత

భారీ వర్ష హెచ్చరికలతో కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తం



నెల్లూరు(సిటీ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి నగరంలో చిరుజల్లులు మొదలయ్యాయి. బుధవారమంతా ఈ జల్లులు కొనసాగడంతో నగర వాసులు సేదతీరారు. కొన్ని నెలలుగా తీవ్రమైన ఎండలు, సెగ, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు, ఎట్టకేలకు వానరాకతో వాతావరణం చల్లబడి ఊరట చెందారు. అయితే రోజంతా చినుకులు పడుతుండటంతో రోజువారీ పనులకు అసౌకర్యం కలిగింది. ముఖ్యంగా దినసరి కూలీలు, రోడ్‌సైడ్ చిరు వ్యాపారు లు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్, విజయమహల్ గేటు అండర్ బ్రిడ్జీల వద్ద వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తోడేందుకు డీజిల్ ఇంజన్లను సిద్ధం చేశారు. లోతట్టు, రద్దీ ప్రాంతాల్లో కమిషనర్ నందన్ పర్యటించారు. వెంకట్రామాపురం, జేమ్స్ గార్డెన్ ప్రాంతాల్లో అనధికార కట్టడాల కూల్చివేతను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షలు జరిపారు. కాగా, బాలాజీనగర్ గ్యాస్ గోదాము వద్ద ఆక్రమణకు గురవుతు న్న పంటకాలువకు గోడ కట్టాలని కమిషనర్‌ను టీడీపీ నాయకుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ కోరారు.



సిద్ధం చేసిన డీజిల్ ఇంజన్ల వద్ద కమిషనర్ నందన్

వ్యాపారులంతా లైసెన్సు తీసుకోవాలి : టీపీఆర్వో

నగరంలోని వ్యాపారులంతా విధిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని టీపీఆర్వో వాసుబాబు కోరారు. కార్పొరేషన్ ఆరోగ్య విభాగం ఉద్యోగులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. నూతన వ్యాపారులను గుర్తించి ట్రేడ్ లైసెన్స్ జారీ చేయాలన్నారు. పాత వారికి క్రమం తప్పక రెన్యువల్ చేయాలని సూచిం చారు. 14 రోజులకు ఒకసారి కచ్చితంగా దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, మురుగు కాలువల్లో పూడికతీసి పనులు చేపట్టాలని ఆదేశించారు.

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి : పలు ఆసుపత్రుల్లో తనిఖీలు



ఓ ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఏడీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి ఆదేశించారు. వారు బుధవారం నగరంలోని కిమ్స్ ఆసుపత్రి, స్మైల్ డెంటల్ ఆసుపత్రి, విజయానంద్ ఆర్థోపెడిక్, సుమ స్కిన్ లేజర్ క్లినిక్, లక్ష్మి ఆర్థోకేర్, ఆకర్ష్ తదితర ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ అనుమతిలేని ఆసుప త్రుల్లో వైద్యం చేయరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ అధికారి అశోక్, తులసీరామ్, హరీష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ రూప్ జన్మదిన వేడుకలు



రూప్‌కుమార్‌ని సత్కరిస్తున్న ఆయన అనుచరులు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు. 50 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గీతామయి వృద్ధుల ఆశ్రమంలో కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలలో వడ్లమూడి చంద్ర, అల్లంపాటి జనార్దన్‌రెడ్డి, జమ్మళ్ల వినోత్, హాజీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

● డీఆర్‌ఈఏ కార్యాలయం ఎదుట సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ధర్నా



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, సెర్ప్ ఉద్యోగులు

నెల్లూరు(హరనాథపు రం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండల సమాఖ్య ఏపీఎం రజనీపై దాడి చేసిన వారిని కఠి నంగా శిక్షించాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెర్ప్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు బుధవారం నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జేఏసీ కన్వీనర్ ఎం కృష్ణయ్య మాట్లాడుతూ గుర్రంకొండలో నాగరాజమ్మ అనే మహిళ ఆశా వర్కర్, వీవోఏగా పనిచేస్తోందని చెప్పారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదిక ఇచ్చినందుకు నాగరాజమ్మ, అమె భర్త శేఖర్ మరికొందరు రజనీ దాడిచేశారని ఆరోపించారు. కారకులను తక్షణం కఠినంగా శిక్షించాల ని కోరారు. అనంతరం డీఆర్వో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రెండవ రోజూ నోరుతెరవని శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రుస్తుం మైన్స్ కేసులో రెండవ రోజు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి పోలీసుల విచారణకు సహకరించనట్లు తెలిసింది. నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని కోర్టు అనుమతితో మూడు రోజుల విచారణకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తొలి రోజు ఎన్ని ప్రశ్నలడిగినా నాకు తెలియదు అన్న సమాధానం వచ్చిన విషయం విదితమే. విచారణ అధికారులు రెండవ రోజు 25 ప్రశ్నలు అడగ్గా వాటికి కూడా నాకేమీ తెలియదు అన్న సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ప్రధానంగా మైన్స్ ద్వారా వచ్చిన నగదు ఎవరెవ్వరికి ఇచ్చారు?, ఇంకెవరి ప్రమేయం ఉంది?.... ఇలా ఏ ప్రశ్నలు అడిగినా నాకు తెలియదు, నాకు సంబంధం లేదన్న సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. గురువారం మరో మారు పోలీసులు శ్రీకాంత్‌రెడ్డిని ప్రశ్నించనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలి

● డీకేడబ్ల్యూ కాలేజీలో క్లైమెట్ యాక్సెన్ గ్రూప్ ఏర్పాటు



ఏపీ క్లైమెట్ యాక్సెన్ గ్రూప్‌నకు ఎంపికైన వలంటీర్లతో కళాశాల సిబ్బంది

నెల్లూరు(విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డీ గిరి అన్నారు. నగరంలోని ఆ కళాశాలలో బుధవారం రెడ్‌క్రాస్ సహకారంతో ఏపీ క్లైమెట్ యాక్సెన్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వలంటీర్లుగా తమ పరిసర ప్రాంతాల్లో గృహాలను దత్తత తీసుకుని పర్యావరణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అనంతరం వంద మంది వలంటీర్లకు ప్రత్యేకం గా రూపొందించిన టీషర్ట్‌లు, టోపీలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టీ శ్రీరంజని, సభ్యులు సీహెచ్ రమాదేవి, హెచ్ స్వాతి, కన్యాకుమారి, మమత, ప్రియాంక పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రచారం చేయండి

(5వ పేజీ తరువాయి)

జరిగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలు ఉంటాయని నాయకులు, కార్యకర్తలు వాటిని ప్రజలకు తెలియజేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో ఎంతోమంది ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారని, వారి స్ఫూర్తితో పార్టీని ముందుకు నడిపించాలని కోరారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి ప్రత్యేక స్థానాలు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, వాటిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కూటమిలో నామినేటెడ్ పోస్టులు బీజేపీకి గణనీయంగా పెరిగాయని, మరింతగా పెరగాలంటే కార్యకర్తలు ప్రజా నాయకులుగా మారాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో నెల్లూరుకు విమానాశ్రయం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకులు కూడా కార్యకర్తలకు అండగా నిలవాలని అన్నారు. సాయంత్రం ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో స్వర్ణకారులతో సమావేశమై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, రాజేశ్వరి, కమల, విల్సన్, భరత్‌కుమార్, రఘునాథరాజు, దయాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడితో కలిసి నగరంలో బీజేపీ శ్రేణుల ప్రదర్శన

కారు ఢీకొని కూలిన రక్షణ దిమ్మె



నేలమట్టమైన సిమెంట్ దిమ్మె, పక్కన బోల్తాపడ్డ కారు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై వడ్డిపాళెం వద్ద నిర్మించిన రక్షణ దిమ్మె కూలిపోయింది. ఆ ప్రాంతంలో తరుచూ వాహనాలు డివైడర్‌ను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు మొరపెట్టుకోవడంతో నెల రోజుల క్రితం కార్పొరేషన్ అధికారులు డివైడర్ ఎదుట సిమెంట్‌తో రక్షణ దిమ్మె నిర్మిం చారు. ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. బుధవారం వేకువజామున నెల్లూరు నుంచి చింతవరం వెళ్తున్న కారు ఈ దిమ్మెను ఢీకొంది. వెంటనే దిమ్మె నేలమట్టమైంది. ఈ క్రమంలో కారు డివైడర్ ఎక్కి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే కార్పొరేషన్ అధికారులు నిర్మించిన సిమెంట్ దిమ్మె కారు ఢీకొంటేనే నేలమట్టం కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. నాణ్యతలో డొల్లతనం బయటపడిందంటూ స్థానికులు పెదవి విరిచారు.

ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వం

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరణలో గిరిధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు రూరల్, ఆగస్టు, 13,(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి చెందిన స్థలాలను అన్యాక్రాంతం కానివ్వం అని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం 28వ డివిజన్ పరిధిలోని చైతన్యపురి పార్కు ప్రహరీ నిర్మాణానికి రూ.21 లక్షలతో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ. వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ క్రమంలో మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవ తీసుకుని కార్పొరేషన్ స్థలాలకు ప్రహరీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెక్క అహల్య, నాయకులు రాజానాయుడు, సాయిసునీల్, మమతారెడ్డి, శోభారాణి, మునిశేఖర్, రాముడు రామయ్య పాల్గొన్నారు.

పీ4తోనే పేదరిక నిర్మూలన

- విదేశాల్లో ఉన్న స్నేహితులను భాగస్వామ్యం చేస్తా
- గంజాయి మత్తు నుంచి యువతను మేల్కొలుపుతాం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనతో పుట్టుకువచ్చిన పీ4 ద్వారా పేదరిక నిర్మూలనతోపాటు అభివృద్ధిని పెద్దఎత్తున చేసుకునే అవకాశం ఏర్పడిందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి తెలిపారు. బుధవారం నుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ, విదేశాల్లో ఉన్న తన స్నేహితులందరినీ పీ4లో బాగస్వాములు చేస్తున్నానని, దీనిద్వారా పేదల జీవితాల్లో వెలుగునింపడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. అలాగే తన సతీమణి కోటంరెడ్డి సంధ్య మల్లెల సంజీవయ్య హైస్కూల్‌ను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ స్కూల్లో రూ.11లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, త్వరలో మరో రూ.50లక్షలతో పనులు చేయనున్నట్లు వివరించారు. నగరంలోని మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకోవాలని తన స్నేహితులను కోరామని, వారు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చంద్రబాబు కలలుకంటున్న స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోటంరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే జిల్లాను అభిమానిస్తూ ఐ లవ్ నెల్లూరు అనే నినాదాన్ని పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. గంజాయి మత్తుకు బానిసైన యువతకు అవగాహన కల్పించి, సరైన మార్గంలో నడిపించేందుకు రాష్ట్రంలోనే ప్రప్రథంగా నుడా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సెంటర్‌ను ఆనం వివేకానందరెడ్డి పార్కులో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతా ర్యాలీ

- 200 ట్రాక్టర్లతో 15 కిలోమీటర్ల మేర పెద్దఎత్తున ర్యాలీ



ఉదయగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ రైతులు బుధవారం ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. దుత్తలూరు తహసీల్దారు కార్యాలయం నుంచి 167-బీజీ జాతీయ రహదారిపై సుమారు 200 ట్రాక్టర్లతో 15 కిలోమీటర్ల మేర ఉదయగిరి అగ్రికల్చర్ మార్కెటింగ్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబుయాదవ్, మాజీ పోలీస్ హౌసింగ్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డిలు టీడీపీ నాయకులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏఎంసీ కార్యాలయంలో కంభం విజయరామి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం పాలన సాగిస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యే క దృష్టిసారించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజక వర్గంలో 44 వేల మంది రైతులకు రూ.30.42 కోట్లు లబ్ధి చేకూరిం దన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి చైతన్య, బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం, రియాజ్, బీవీ రామారావు, మల్లం పాటి గురవయ్య నాయుడు, ఉండేలా గురవారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, తుమ్మల కిరణ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి


'జ్ఞానముద్ర'ల గుడి.. గొలగమూడి!

- 'అవధూత వెంకయ్య' నడయాడిన నేల
- అన్నార్తుల ఆకలి తీర్చే ఆధ్యాత్మిక క్షేత్రం
- తిరుమల తరహాలో అభివృద్ధి చేయడమే లక్ష్యం
- ఈ నెల 18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

ఊరి జనం భక్తితో కొలిచే ఆంజనేయ స్వామి ఆలయం.. పక్కనే కోనేరు.. ఆ సమీపంలోనే బొంతజెముడు పుల్లలతో మంట వేసుకుని... తుంబుర మీటుతూ.. 'ఓం నారాయణ.. ఆది నారాయణ' అంటూ తనదైన లోకంలో విహరించే ఓ ఆధ్యాత్మికవేత్త! తన వాక్కును వేదంగా భావించే కొందరు శిష్యులు... నమ్మకంతో తన వద్దకు వచ్చే భక్తులకు వేలిముద్రలు వేసి.. చీటీల రూపంలో ఇచ్చే ఆశీర్వాదం! ఇవీ.. గొలగమూడిలోని అవధూత వెంకయ్య స్వామి ఆధ్యాత్మిక చర్యలకు సంకేతాలు.



వెంకటాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చేజర్ల మండలంలోని నాగులవెల్లటూరు గ్రామస్థులైన సోంపల్లి పెంచలయ్య, పిచ్చమ్మ దంపతులకు జన్మించిన వెంకయ్య మనిషిలోనే దేవుడుంటాడని రుజువు చేశారు. నామమాత్రపు చదువుతో సరిపెట్టుకున్న వెంకయ్య చిన్ననాటి నుంచే వ్యవసాయం చేస్తూ అందులో విజయం సాధించారు. వయసుతోపాటు ఆధ్యాత్మిక చింతనను కూడా పెంచుకున్న వెంకయ్య సామాన్యులకు అర్థం కాని రీతిలో మాట్లాడుతూ పిచ్చి వెంకయ్యగా పిలిపించుకున్నాడు. అవసాన దశలో నడవలేని స్థితికి చేరారు. ఆయన కోరిక మేరకు శిష్యులు స్వామిని కంచి, తిరువళ్లూరు, శ్రీరంగం, తిరుపతి తదితర క్షేత్రాలకు డోలీల ద్వారా తీసుకెళ్లారు. పలు పుణ్య క్షేత్రాలకు వెళ్లి తపమాచరించిన వెంకయ్య స్వామి చివరికి గొలగమూడి చేరారు.



మూడు రోజుల దాకా.. సమాధి చేయకుండా...

1982, ఆగస్టు 24న స్వామి వారు కాలధర్మం చేశారు. అయితే ఆయన శిష్యులు స్వామివారు యోగముద్రలో ఉన్నారని 3 రోజుల వరకు సమాధి చేయలేదు. అయితే శరీరం ఉబ్బడంతో సమాధి చేయక తప్పదని భావించిన శిష్యులు స్వామిదేహాన్ని తరలిస్తుండగా ముల్లు తగిలి రక్తం కారింది. దీంతో ఏం చేయాలో తెలియని శిష్యులు సమాధి చేయాలా, వద్దా అని రాసిన రెండు చీటీలను ఉంచి తీశారు. అయితే సమాధి చేయాలని చీటీ వచ్చింది. దీంతో తూర్పు వైపు తల ఉంచి సమాధి చేశారు.

నిత్యం వెలిగే పవిత్ర 'ధుని'

'అగ్నిగుండం కోటి లింగాల పూజ గదయ్యా..' అన్న స్వామి సూక్తిని అనుసరించి శిష్యులు వెంకయ్య సమాధి ముందు భాగాన 'ధుని' ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు భక్తులు ధునిలో బొంత జెముడు పుల్లలు, కొబ్బరి కాయలు వేసి ధుని ఆరిపోకుండా నిత్య పూజలు ఆచరిస్తున్నారు. స్వామి సమాధి దర్శనానికి ముందే ధుని చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీగా మారింది.

ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా!

ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలయ్యా! అంటూ స్వామి ఎప్పుడూ చెబుతుండేవారు. కేవలం అన్నదానం ద్వారా మాత్రమే మనిషిని సంతృప్తిపరచగలమని బోధించేవారు. దీంతో భక్తు లు ఇచ్చే బియ్యం, పప్పులు, కూరగాయలతో ఆశ్రమ నిర్వాహకులు నిత్యం వేలా ది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు భోజనం చేయడానికి వీలు గా భక్తుల విరాళాలతో విశాలమైన డైనింగ్ హాలును నిర్మించారు.

పరివర్తనకు మార్గాలు.. స్వామి బోధనలు

వెంకయ్య స్వామి జీవించి ఉన్న రోజుల్లో చెప్పిన సూక్తులు గొప్ప పరివర్తనకు మార్గాలని భక్తుల విశ్వాసం. నిత్య జీవితంలో వాటిని ఆచరిస్తే మనిషి మహనీయుడిగా ఎదుగుతాడని చెప్పడంలో సందేహం లేదు. బాధలను ఆధ్యాత్మిక చింతనతో ఉతికేయడం చాకలి యోగమని, కోరికలను తెంచుకోవడం మంగలి యోగమని స్వామి నర్మగర్భంగా చెప్పేవారు. పావలా దొంగిలిస్తే రూపాయి పోతుందయ్యా.. అంటూ ఇతరుల సొమ్ము దొంగిలిస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో.. అత్యంత సులభంగా స్పష్టంగా చేశారు. ఆధ్యాత్మిక భావనకు దూరంగా పోవద్దని.. దారం తెగిపోకుండా చూసుకుంటే నీ బాగోగులు తాను చూస్తానని స్వామి భక్తులకు ప్రబోధించారు.

తిరుమల తరహాలో అభివృద్ధి

గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధి గుడిసె స్థాయి నుంచి నేడు 54 ఎకరాలకు చేరింది. తిరుమల తరహాలో ఇక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.200 కోట్లకుపైగా విలువ చేసే ఆస్తులు ఆలయానికి సమకూరాయి. ఆశ్రమ ఈవోగా విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పేద విద్యార్థులకు ఉచిత భోజనంతోపాటు ఓ పాఠశాలను నిర్మించారు. టాటా సంస్థ యాజమాన్యం సైతం ఈఓ విజ్ఞప్తి మేరకు రూ.కోటి రుపాయలు వెచ్చించి హాస్టల్ నిర్మించింది. అలాగే భక్తుల వసతి కోసం 270కిపైగా గదులను నిర్మించారు. ఆరు అతిథి గృహాలు, ఆర్ఓ ప్లాంట్లు, 4 డార్మెంటరీలు, కల్యాణమండపాలను సైతం నిర్మించారు. రూ.6 కోట్లతో ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించి వివిధ రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. వాటర్ స్టోరేజ్ ట్యాంకులను కూడా నిర్మించారు. ఆరాధనోత్సవం రోజు తెప్పోత్సవం కోసం రూ.లక్షలు వెచ్చించి ఆధునిక వసతులు కల్పించారు. ఆశ్రమ ప్రాంగణంలో ధ్యానమందిరాన్ని కూడా నిర్మించారు. సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. ఈవోగా బాలసుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టక రూ.7 కోట్లు ఉన్న ఆస్తుల విలువ నేడు 200 కోట్లకు చేరింది.

18 నుంచి ఆరాధనోత్సవాలు

ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. 18న ఉదయం సర్వభూపాల వాహన సేవ, రాత్రి కల్పవృక్ష వాహన, 19న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న ఉదయం హనుమంత, రాత్రి హంస, 21న ఉదయం చినశేషవాహనం, రాత్రి గజ వాహనం, 22న ఉదయం అశ్వ వాహనం, రాత్రి పెదశేష వాహనం, 23న ఉదయం సింహవాహనం, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిస్తామన్నారు. 24న ఉదయం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులచే స్వామికి పట్టువస్త్రాల సమర్పణ, ఆ తర్వాత రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచీ భక్తులు తరలి వస్తారు.

అక్రమంగా తరలుతున్న వేపకర్ర

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న వేపకర్రను రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంఘటన మంగళవారం రాత్రి వేంపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారులు ఇటీవల తమ ఇష్టానుసారంగా వేపకర్రను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రాత్రి సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా వేపకర్రను తరలిస్తుండడంతో విషయం తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు వీఆర్వో ఆంథోని బాబుకు సమాచారం అందించారు. దీంతో ఆయన మార్గ మధ్యంలోనే ఆ ట్రాక్టర్‌ను అడుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. గ్రామస్థుల సహకారంతో ట్రాక్టర్‌ను తహసీల్దారు కార్యాలయానికి తరలిం చారు. కాగా, బుధవారం తహసీల్దారు హేమంత్ కుమార్ కార్యాలయానికి రాకపోవడంతో ఆ ట్రాక్టర్ ఆవరణలోనే ఉంది.



కార్యాలయానికి తరలించిన ట్రాక్టర్

పిచ్చికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక వీధిలో బుధవారం ఇద్ద రు చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేయ డంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వీధిలో అడుకుంటున్న వారిపై ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో వారికి కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కను తరిమికొట్టి అనంతరం వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. పట్టణంలో కుక్కల బెడద అధి కంగా ఉందని, పలువురు వాటి బారినపడి గాయాలపాలవుతున్నారని, ఇప్పటికైనా అధి కారులు స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రైతు నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సోమిరెడ్డితో రైతు సంఘాల నాయకుల భేటీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. వారు బుధవారం నెల్లూరులోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. 10 రోజుల్లో ఎడగారు పంట కోతలు ప్రారంభమవుతాయని, ధాన్యం కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన సోమిరెడ్డి రాష్ట్ర పౌరసఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో ఫోన్‌లో సంభాషించారు. జిల్లాలో రెండో పంట ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవా లని కోరారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతోనూ మాట్లాడి తగుచర్యలు చేపట్టాలని కోరుతామని రైతు నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షేక్ షాన్‌వాజ్, ఏవీఆర్ నాయుడు, వై శ్రీనివాసులురెడ్డి, పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు దారుణ హత్య

కత్తులతో విచక్షణ రహితంగా దాడి

నెల్లూరు(క్రైం) ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో పట్టపగలు అందరూ చూస్తుండగానే ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని కత్తులతో విచక్షణా రహితంగా హత్య చేశారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు... నగరంలోని సీఏఎం స్కూల్ ఎదురుగా కసాయి వీధిలో షేక్ లైక్(36), రేష్మ దంపతులు నివసిస్తున్నారు. వారికి రోషన్ జమీర్, రూమాన్ కుమారులు. లైక్ తన అన్న రఫీతో కలిసి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లైక్ వద్ద కోటమిట్టకు చెందిన నూరు పని చేస్తున్నాడు. ఇద్దరు మంచి స్నేహితులుగా ఉండేవారు. అయితే కొద్ది రోజుల క్రితం వారి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం లైక్ పాలప్యాకెట్ల కోసం బైక్‌పై అలంకార్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా నూరు, అతని స్నేహితుడు అడ్డుకుని కత్తులతో పొడవబోయారు. లైక్ బైక్‌ను వదిలేసి సమీపంలోని విక్టోరియా గార్డెన్ వీధిలోకి పరుగులు తీశాడు. దీంతో నిందితులు వెంబడించారు. అదే సమయంలో అటుగా వెళుతున్న లైక్ అన్న రఫీ విషయాన్ని గమనించి పెద్దగా కేకలు వేశాడు. ఇంతలో ఇద్దరు నిందితులు లైక్‌ను కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసి పరారయ్యారు. రఫీ అక్కడకు చేరుకునేలోపే లైక్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్న బజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టు మార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లైక్‌కు నగరంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో పరిచయం ఉండటంతో వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో లైక్ (ఫైల్)



ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్న హరిత రాయబారులు

మీ వీధులు శుభ్రంగా ఉన్నాయా!?

- పారిశుధ్యం, మంచినీటి సరఫరా ఎలా ఉంది!?
- 'ఐవీఆర్ఎస్' సర్వేలో 95 శాతం మంది సమాధానం
- సోమలరేగడ పంచాయతీకి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం
- రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానం

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 'మీ గ్రామంలో వీధులు శుభ్రంగా ఉన్నాయా!? ఇంటింటికి హరిత రాయబారులు వచ్చి చెత్త, వ్యర్థాలు తెసుకెళుతున్నారా!? చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వాడుకలో ఉందా!? మురుగు కాలువలు శుభ్రంగా ఉన్నాయా!?' అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రజలకు ఫోన్లు వస్తున్నాయి. పారిశుధ్యంతోపాటు మంచినీటి సరఫరా తీరుపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఆరా తీస్తున్నారు. ప్రజాభిప్రాయాలను విశ్లేషించి పారిశుధ్యం, మంచినీటి సరఫరా బాగా లేని చోటకు వెళ్లాలని జిల్లాస్థాయి అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. అధికారుల పల్లెబాట పడుతుండటం, పారిశుధ్య నిర్వహణ బాగుందని ప్రజలు చెప్పాల్సి ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది స్వచ్ఛతపై శ్రద్ధ వహిస్తున్నారు.

ఉత్తమంగా సోమలరేగడ

జిల్లావ్యాప్తంగా 722 పంచాయతీలు ఉండగా, ఆగస్టులో 155 పంచా యతీల్లో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ జిల్లాస్థాయిలో ప్రథమం, రాష్ట్రస్థాయిలో నాల్గవ స్థానం సాధించింది. అలాగే మర్రిపాడు మండలం అల్లంపాడు పంచాయతీ చివరి స్థానంలో నిలిచింది. సోమలరేగడ పంచాయతీలో 309 నివాసాలున్నాయి. పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం, వీధులు శుభ్రం చేయించి పారిశుధ్య మెరుగుకు పెద్దపీట వేశారు. దీంతో ఈ నెల 5న ప్రభుత్వం నుంచి ఐవీఆర్ ఎస్ కాల్స్‌లో పారిశుధ్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా ప్రశ్నకు 90, వారానికి కనీసం రెండు సార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా ప్రశ్నకు 100 శాతం సమాధానం ఇచ్చారు. దీంతో సరాసరి 95 శాతం మంది ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వడంతో ఆ పంచాయతీకి ఈ ఘటన దక్కింది.

స్వచ్ఛతే లక్ష్యం

అందరి సహకారంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టి స్వచ్ఛతే లక్ష్యంగా పని చేస్తు న్నాం. మంచినీటి సమస్య తలెత్తకుండా చూడటంతోపాటు ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తున్నాం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సోమలరేగడ పంచాయతీ జిల్లాలో ప్రథమ, రాష్ట్రంలో నాల్గవ స్థానం సాధించడం అభినందనీయం.

- శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి


అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ నియామకం

నెల్లూరు (లీగల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది షేక్ అన్వర్ బాషాను నియ మిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. నెలకు 10 వేల రూపాయల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.12లక్షల బంగారం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైళ్లలో వరుసగా నేరాలకు పాల్పడుతూ పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను నెల్లూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిందితుడి వివరాలను డీఎస్పీ మురళీధర్ విలేకర్లకు వెల్లడించారు. నేరాల కట్టడిలో భాగంగా నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ తన సిబ్బంది, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో రైళ్లు, రైల్వే స్టేషన్లలో వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా జనశతాబ్ది రైలు నుంచి దిగి అనుమానాస్పదంగా వెళుతున్న హైదరాబాద్‌కు చెందిన కే గోవర్దన్ అలియాస్ కార్తీక్ అర్విందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా కావలి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో రైళ్లలో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించాడు. దీంతో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.12 లక్షల విలువ చేసే 143 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జనరల్ టికెట్ తీసుకుని రైళ్లలో ప్రయాణిస్తూ ఏసీ బోగీల్లో ప్రయాణికులు నిద్రిస్తున్న సమయంలో బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులు అపహరిస్తుంటాడని రైల్వే డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే హైదరాబాద్, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విజయవాడల్లో పలు కేసులున్నాయని చెప్పారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌గౌడ్, హజరిలాల్ గుర్జార్, నెల్లూరు, గూడూరు రైల్వే ఎస్ఐలు హరిచందన, చెన్నకేశవ, సిబ్బంది దయాకర్, మణికంఠ, కిరణ్ తదితరులను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీధర్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మౌలాలీ పేర్కొన్నారు. రెండోరోజైన బుధవారం స్థానిక డిపో ఎదుట ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9588
వెండి కిలో ధర	రూ. 118700
వెండి ఒక గ్రాము	రూ. 121.70

న్యూస్ బాక్స్

హర్‌ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం హర్‌ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి భారతజాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలన్నారు. శుక్రవారం వరకు అవగాహన ర్యాలీలు జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, కోఆర్డినేటర్ విక్రమ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టాలపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘ కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్‌గా గడ్డం వెంకట సామయ్య, డైరెక్టర్లుగా బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజాలు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతుల అభివృద్ధికి తమవంతు కృషి చేయడంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు వారికి అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులరెడ్డి, బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, సీఈవోలు పోలయ్య, రత్తయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల తనిఖీ

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని అశ్వినీపురం, కరటంపాడు, మహిమలూరులో ఉన్న మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు.


బుక్కాపురానికి పల్లెవెలుగు బస్సు

వింజమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామానికి పల్లెవెలుగు బస్సును బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో వింజమూరు నుంచి ఆత్మకూరు బుక్కాపురం మీదుగా ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. క్లస్టర్ కన్వీనర్ పాములపాటి మాల్యాద్రి మాట్లాడుతూ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట దిగుబడులను సంరక్షించుకోవాలి

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పంట దిగుబడులు తడవకుండా రైతులు సంరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కల్లాల్లో ఉన్న వేరుశనగ దిగుబడులను పరిశీలించి వర్షాలు కురుస్తున్నందున రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు.

ఎన్‌డీసీసీ చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ పాలకవర్గం



ధనుంజయ్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్

కలువాయి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ ధనుంజయ్‌రెడ్డిని కలువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్‌పర్సన్‌గా నియమించిన గాడిపర్తి జగదల్‌నాయుడు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నాలి పెంచలయ్య, గ్రంధి సురేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా పీఏసీఎస్ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని వారు ధనుంజయ్ రెడ్డిని కోరారు. వారి వెంట టీడీపీ మండల కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ నాయకులు సోమయ్య యాదవ్, శ్రీధర్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

● పొంచిఉన్న ప్రమాదం

సంగం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామం నడిబొడ్డున ఉన్న పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. పంచాయతీ భవనం శిథిలమవడంతో 2018లో టీడీపీ హయాంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో మరో ప్రభుత్వ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించారు. నూతన భవనంలోకి పంచాయతీ కార్యాలయాన్ని మార్చారు. అయితే శిథిలమై ప్రమాదకరంగా ఉన్న పంచాయతీ భవనాన్ని తొలగించలేదు. ఈ శిథిల భవనం సమీపంలో ఒకవైపు ప్రాథమిక పాఠశాల, మరోవైపు ఉన్నత పాఠశాల ఉండడంతో అది ఎప్పుడు కూలుతుందో.. ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న శిథిలమైన భవనం

మైనింగ్ అనుమతులు రద్దుచేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు నేతల వినతి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని కొండప్రాంతంలో మంజూరు చేసిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ బుధవారం విజయవాడలోని రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ఎస్ ప్రసాద్‌ను కలిసి మేధావుల ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మైనింగ్ పర్యావరణ పరిరక్షణ సంస్థ నుంచి అనుమతులు నిలుపుదల చేయాలని కోరారు. అలాగే కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాయలంలోను డీఏవో భార్గవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వరికుంటపాడు సర్పంచు దిలీప్‌కుమార్, వినియోగదారులు, మానవ హక్కుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, సరాబు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వీరితో పాటు నెల్లూరు పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసిన పార్టీ సీనియర్ నాయకులు ఆంద్రా పరంధామిరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, ఆంద్రా శివారెడ్డిలు సైతం వినతిపత్రం అందజేసి మైనింగ్ అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైతుకూలీ, కార్మిక సంఘాల డిమాండ్

స్థానిక పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి సమీపంలోని నివాస ప్రాంతంలో ఉండే కొండపై మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని రైతుకూలీ, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. బుధవారం వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించిన బృంద సభ్యులు ఆ కొండను నంద్యాలకు చెందిన పోచ వెంకటరెడ్డి కంపెనీకి కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు జీవించే హక్కును కాలరాస్తూ గ్రామాలను విధ్వంసం చేయాలని చూడడం దారుణమన్నారు. అలాగే గ్రామస్థులపై వేధింపులను పోలీసులు మానుకోవాలన్నారు. ప్రజలు చేస్తున్న న్యాయ పోరాటానికి సంపూర్ణ మద్దతు అందజేయడంతో పాటు భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల జిల్లా నాయకులు ఎల్ లక్ష్మిరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య, ఆర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సీతారామపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి సన్మార్గంలో నడిచినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను అన్నారు. బుధవారం స్థానిక కోటవీధిలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణమరాజు, ఉపాధ్యాయులు రవిచంద్ర, ముజీబాతబస్సుమ్, గోసుల వెంకటేశ్వర్లు, ఖాజా రహమతుల్లా, అంగన్వాడీ కార్యకర్తలు, మహబూబ్ జానీ, స్రవంతి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలి




విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంఈవో శేషగిరి, ఉపాధ్యాయులు, పోలీసులు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలని అధికారులు తల్లిదండ్రులకు సూచించారు. మత్తులో తూలుతున్న బాల్యం శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖాధికారులు, పోలీసులు స్పందించారు. స్థానిక గిరిజన కాలనీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. నెయిల్ పాలిష్ రిమూవర్ గుడ్డలో వేసుకుని నోటితో పీల్చుతూ మత్తుకు అలవాటుపడి తిరుగుతున్న వారివెంట పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో-2 శేషగిరిరావు సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమౌతుందని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎం వెంకటరమణ, జీ కిషోర్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

● అడ్డుకున్న గ్రామస్థులు ● పరిశీలించిన వీఆర్వో



కంపచెట్లు తొలగించి చదును చేసిన ప్రభుత్వ భూమి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలివేలుమంగాపురం గ్రామ శివారు ప్రాంతంలో ఆ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 140, 141లోని విలువైన ప్రభుత్వ భూమిని మంగళవారం ఓ రైతు ఆక్రమించేందుకు పూనుకున్నాడు. తన పొలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన ఆ రైతు సుమారు 3 ఎకరాల భూమిలో యంత్రాలతో కంపచెట్లను తొలగొంచి చదును చేశాడు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థులు పనులను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కాగా, బుధవారం తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్ ఆప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన విషయం వాస్తవమేనని నిర్ధారించిన ఆయన నివేదికలను అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కాగా భూమిని ఆక్రమించిన రైతు అందుబాటులో లేకపోవడంతో వీఆర్వో ఫోన్‌లోనే హెచ్చరించడం జరిగింది.

ఎన్‌పీసీఐ అనుసంధానంపై దృష్టి సారించండి

ఉదయగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియపై దృష్టిసారించాలని సాంఘిక సంక్షేమ శాఖాధికారి రమణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వింజమూరు, కలిగిరి మండలాల సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల పరిధిలో విద్యార్థులకు తల్లికి వందనం నగదు జమకాని వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి : సాధన సమితి

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని మంత్రివర్గ ఉప సంఘానికి జిల్లా సాధన సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో జిల్లాల పునర్విభజనపై నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్‌లకు సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, రబ్బానీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారం పండే భూములున్నా నీరు లేక బీళ్లుగా ఉన్నాయన్నారు. ఇటు పంటలు పండక, అటు ఉపాధి లేక ప్రజలు వలసబాట పడుతున్నారన్నారు. విద్యా, వైద్యరంగాలు ప్రజలకు అందుబాటులో లేవన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఉదయగిరి కేంద్రంగా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారన్నారు. స్పందించిన మంత్రులు సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



మంత్రులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సాధన సమితి నాయకులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఎం నిరసన

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు నిరసన చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన ప్రస్తుత ప్రభుత్వం మరలా వాటిని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో గతంలో రూ.500 వస్తున్న బిల్లు ప్రస్తుతం రూ.1,500 వస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ట్రూఆఫ్ చార్జీల పేరుతో రూ.30 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఉదయగిరి ప్రాంతంలో ఇటీవల అప్రకటిత విద్యుత్ కోతలు అధికమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలి


ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు కేటాయించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన బ్యాంకర్లు, వెలుగు, పశు సంవర్ధక, వ్యవసాయ శాఖ అధికారులతో జేఎంఎల్‌బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల రికవరీ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయ గ్రూపులు తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మెట్ట ప్రాంతం కావడంతో రైతులు డెయిరీఫామ్‌లు ఏర్పాటుకు అధిక రుణాలు మంజూరు చేయడంతోపాటు వారు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఖాతాదారుల ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయాలన్నారు. బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రధానంగా స్వయం సహాయక సంఘాల రుణాల రికవరీపై దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్యాంకర్లు, ఇతర శాఖల సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు రవిశంకర్, కాశయ్య, జయదేవ్, ఎంపీడీవోలు అప్పాజీ, గోపీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్

గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేయించడంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యశాఖాధికారి జి సుజాత సూచించారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీలో జరుగుతున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారం గురించి వివరించారు. పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ వైద్యశాల వైద్యాధికారి షేక్ అస్మా, ఎంపీహెచ్‌ఈవో ఎస్ సుధాకర్, డీఈఐసీ రమణ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనాస్థలిలో సయ్యద్ అన్వర్‌బాష మృతదేహం

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాశిలి వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వాశిలి గ్రామానికి చెందిన సయ్యద్ అన్వర్ బాష(55) వాశిలి బస్టాండ్ సెంటర్ వద్ద జాతీయ రహ దారి రోడ్డు మార్జిన్‌లో టీవీఎస్ మోపెడ్ వాహనంపై కూర్చొని ఉండగా నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కారులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ జిలానీ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జిలాని తెలిపారు. మృతుడు అన్వర్‌బాష బేల్దారు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోలీసుల అదుపులో బాల నేరస్థుడు

ఉదయగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ఓ బాల నేరస్థుడిని అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10వ తేదీ రాత్రి ఏఎంసీ కార్యాలయంలో కంప్యూటర్లు, ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా పట్టణంలోని షబ్బీర్ కాలనీకి చెందిన ఓ బాల నేరస్థుడు చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని సామగ్రిని రికవరీ చేశామన్నారు. ఈమేరకు నిందితుడిని జువైనల్ కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

కాలువలో కారు బోల్తా

● పలువురికి స్వల్ప గాయాలు

మర్రిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలో బోల్తాపడిన సంఘటన పొంగూరు గ్రామం వద్ద బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు ప్రాంతానికి చెందినవారు అనంతసాగరం మండలం గౌరవరంలో తమ బంధువుల పెళ్లికి వెళ్తుండగా పొంగూరు గ్రామ సమీపంలో ఉన్న పెద్ద మలుపు వద్ద కారు అదుపు తప్పి కాలువలో పడింది. కారులో ఉన్న వారు అంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా, వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.



అదుపుతప్పి కాలువలో పడిపోయిన కారు

అదుపు తప్పి లారీ బోల్తా



రోడ్డుపై పడిపోయిన లారీ


మర్రిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన నెల్లూరు-కడప సరిహద్దులో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. కోళ్లను రవాణా చేసే ఖాళీ లారీ దుత్తలూరు నుంచి బద్వేలు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

రెండు ఆటోల ఢీ : ఇద్దరికి గాయాలు

సంగం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై వెంగారెడ్డిపాళెం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు బుధవారం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మండలంలోని కోలగట్లకు చెందిన కాకర్ల కృష్ణవేణి అనే మహిళ ఆటోలో బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుండగా మార్గమధ్యంలో వెంగారెడ్డిపాళెం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో కాకర్ల కృష్ణవేణికి తీవ్ర గాయమైంది. అదేవిధంగా మరో ఆటోలోని దినేష్ అనే యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైనవారిని చికిత్స నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

● కాపాడిన పోలీసులు



శ్రీనివాసులును అదుపులోకి తీసుకొన్న పోలీసులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉలవపాడు పంచాయతీ హుస్సేన్‌నగర్‌కు చెందిన కొమరగిరి శ్రీనివాసులు అనే వ్యక్తి తూర్పుబోయమడగల గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి తన భార్య మాట వినడం లేదని మనస్థాపం చెందాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు 112 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేసి స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ రఘునాథ్ సిగ్నల్స్ ఆధారంగా సిబ్బందితో గాలింపు చేపట్టారు. చివరికి అలివేలుమంగాపురం గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో అతన్ని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటసుబ్బయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 520

దుకాణాల్లో తనిఖీ : ప్లాస్టిక్ కవర్ల సీజ్

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వాణిజ్య ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఆధ్వర్యంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు బుధవారం దుకాణాలలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు సీజ్‌చేసి జరిమానాలు విధించారు. పోస్టాఫీసు సెంటర్, కనిగిరి రోడ్డు, వెంకటనారాయణ బజారు, రైతు బజార్లలోని దుకాణాలతో పాటు తోపుడుబండ్లు, హోటళ్లు, చిరువ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వలన కలుగుతున్న దుష్పరిణామాలను వివరించి పర్యావరణహితమైన జూట్ కవర్లే వాడాలని ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వేధిస్తున్న యూరియా కొరత!

● విస్తారంగా జామాయిల్ తోటలు ● కందుకూరు సబ్ డివిజన్‌లో వేలాది ఎకరాల్లో పెంపకం ● రైతుల ఆందోళన



కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా సరఫరా లోటు ఉండటంతో పాటు ఈ సబ్ డివిజన్‌లో రైతుల అవసరాలను గుర్తించి ఇండెంట్లు పెట్టడంలో వ్యవసాయాధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పైర్లను రైతులు సాగు చేయలేకపోయారు. అయితే గత రెండేళ్లుగా ఈ ప్రాంతంలో వేలాది ఎకరాలలో దీర్ఘకాలిక పంట అయిన జామాయిల్ చెట్ల పెంపకం చేపట్టారు. ఈ ఏడాది సైతం మే నెలలో కురిసిన వర్షాల ఆధారంగా వందలాది ఎకరాల్లో జామాయిల్ మొక్కలు నాటారు. మొత్తంగా కందుకూరు సబ్ డివిజన్‌లో 70వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జామాయిల్ సాగులో ఉంది. ఈ చెట్లకు ఏడాదికి మూడుసార్లు ఎరువులు వేయాల్సి ఉంది. ఒక్కో విడత కనీసం బస్తా ఫాస్పేట్, బస్తా యూరియాను జామాయిల్‌కు రైతులు ఎదబెడతారు. అంటే ఏడాదిలో రమారమి 2 లక్షల బస్తాల ఫాస్పేట్, 2లక్షల బస్తాల యూరియా కేవలం జామాయిల్‌కు అవసరం కాగా ఈ సీజన్‌కు 70వేల బస్తాల ఫాస్పేట్, 70వేల బస్తాల యూరియా అవసరమవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే రైతుల అవసరాన్ని అంచనా వేయకుండా ఈ ప్రాంతంలో ఖరీఫ్‌లో పెద్దగా పంటల సాగు జరగలేదని అందుకనుగుణంగానే ఎరువుల ఇండెంట్లు పెట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎరువులు వేసేందుకు సిద్ధపడుతున్న రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఫాస్పేట్ ఎరువులను ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నా యూరియా దొరకని పరిస్థితి. కందుకూరు మండలంతో పాటు వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం మండలాల రైతులు కూడా యూరియా కోసం కందుకూరుకే పరుగులు తీస్తున్నారు. దీంతో పట్టణంలోని ప్రైవేటు వ్యాపారులు అసలు యూరియా స్టాకు లేదని సమాధానం చెబుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఎరువుల వ్యాపారులు బస్తా యూరియాకు రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. అది కూడా తమ దుకాణంలో రెగ్యులర్‌గా వచ్చే రైతులకు మాత్రమే సరఫరా చేస్తుండటంతో మిగిలిన రైతులు యూరియా కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఏడీఏ శేషారెడ్డి జామాయిల్‌కు యూరియా ఇవ్వలేమని, అది మా పైర్లు జాబితాలోకి రాదని ప్రకటించటం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ఏడీఏ స్థాయి అధికారి ప్రకటన చేయటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. కందుకూరు సబ్ డివిజన్‌లో ప్రస్తుతం అత్యధిక విస్తీర్ణంలో సాగై ఉన్న పైరు జామాయిల్ అని, మరే ఇతర పైరు కూడా ఇన్ని వేల ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం లేదని రైతులు విమర్శిస్తున్నారు. గత రెండేళ్లుగా గిట్టుబాటు ధర లభిస్తూ రైతుకు కొంత లాభసాటిగా కనిపిస్తున్నది కూడా జామాయిల్ మాత్రమేనని, దీనికి మూడుసార్లు ఎరువులు వేస్తే కర్ర దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. జామాయిల్‌ను ఈ క్రాప్ చేస్తున్న వ్యవసాయాధికారులు దానికి ఎరువులు ఇవ్వబోమని చెప్పటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కందుకూరు ప్రాంతంలో సాగులో ఉన్న జామాయిల్ తోటలు

● ఆర్‌ఎస్‌కేలలో ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేయటం గగనంగా మారుతున్న పరిస్థితుల్లో సహకార సంఘాలు, రైతు సేవాకేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)లలో ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సచివాలయానికి అనుబంధంగా ఆర్‌ఎస్‌కే ఉండటంతో పాటు ఎరువుల నిల్వకు తగిన గోదాములు కూడా ఉన్నందున ఎక్కడి రైతులు అక్కడే ఎంఆర్‌పీలకు ఎరువులు పొందేలా నిల్వలు పెట్టాలని కోరుతున్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద అదనపు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రవాణా ఛార్జీలు వ్యయప్రయాసలు మరింత భారంగా మారుతోందని వాపోతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇండెంట్లు తీసుకుని ఆర్‌ఎస్‌కేలలో ఎరువులు ఉంచేలా చూడటం ద్వారా ఎరువుల బ్లాక్ మార్కెట్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న యూరియా డిమాండ్‌కు అనుగుణంగా ఇండెంట్లు పెట్టి తెప్పించాలని కోరుతున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



గత కొన్నేళ్లుగా రైతుకు కొంత లాభసాటిగా కనిపిస్తున్నది జామాయిల్ మాత్రమే. ఈ పరిస్థితుల్లో వేలాది ఎకరాలలో సాగుచేసి ఉన్న జామాయిల్‌కు యూరియా లేదని చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జామాయిల్‌కు ఎరువులు వేసేందుకు సిద్ధపడుతుండగా యూరియా లేక అవస్థలు పడుతున్నాం. రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఇతర ఎరువుల నిల్వలు పెట్టేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలి.

\- కంద్రా చినమాలకొండయ్య, రైతు, చుట్టుగుంట



రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, బోగోలు

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

? మండలంలో భూముల రీ సర్వే ఎన్ని గ్రామాల్లో పూర్తయింది. మిగిలిన గ్రామాల్లో ఎప్పుడు చేస్తారు.

! మండలంలో 12 రెవెన్యూ గ్రామాలు ఉండగా 8 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. అల్లిమడుగు, బిట్రగుంట, జువ్వలదిన్నె, బోగోలు రెవెన్యూ గ్రామాల్లో చేయాల్సి ఉంది. ఈ గ్రామాల్లో డిసెంబరు నుంచి రీసర్వే ప్రారంభించి ప్రభుత్వం నిర్దేశించిన 2027 నాటికి పూర్తి చేస్తాం.

? రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో చాలా తక్కువ సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. అవి కూడా జాయింట్ ఎల్పీఎంలు, పేర్లు మార్పులు, భూమి కొలతలో కొద్దిపాటి తేడాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు రైతుల వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు, రికార్డులను పరిశీలించి సరిచేస్తున్నాం.

? చుక్కలు, సీజేఎఫ్‌ఎస్, ప్రభుత్వ భూముల్లో ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాల పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో చుక్కల భూములను పూర్తిగా పట్టా భూములుగా క్రమబద్ధీకరించాం. ఎంకా ఎక్కడైనా మిగిలి ఉంటే మీసేవ, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం. సీజేఎఫ్‌ఎస్, ప్రభుత్వ భూములను అర్హులకు అసైన్‌మెంట్ పట్టాలు మంజూరుకు జాబితాలు తయారు చేస్తాం.

? మండలంలో నీటిపన్ను బకాయిలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో 12,220 మంది రైతులు ఉండగా కొందరు మాత్రమే నీటిపన్ను చెల్లించారు. దాదాపు రూ.2,44,50,257 బకాయిలు ఉన్నాయి. బకాయిల వసూళ్ల బాధ్యత వీఆర్వోలకు అప్పగించాం. ఇటీవలనే ప్రభుత్వం నీటి పన్ను బకాయిలపై విధించిన 6 శాతం వడ్డీని రద్దు చేసింది.

న్యూస్ బాక్స్

టీఆర్‌ఆర్‌లో 'నషా ముక్త్‌భారత్ అభియాన్'

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఈ పరిస్థితిలో మత్తుపదార్థాలకు దూరంగా ఉండి నవభారత నిర్మాణంలో భాగస్వాములై ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

18న చలో కరేడు

ఉలవపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ పరిశ్రమ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి చేపట్టిన బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 18వ తేదీన రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో చలో కరేడుకు పిలుపు ఇచ్చినట్లు సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. కావున చలో కరేడు కార్యక్రమాన్ని స్థానిక రైతులు, ప్రజాసంఘాల నేతలు, మద్దతుదారులు విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్ 30 యాక్ట్ రద్దు చేయాలి

కరేడు గ్రామంలో అమలులో ఉన్న పోలీస్ 30 యాక్ట్, భూసేకరణ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్, అఖిలభారత రైతు కలీ సంఘం రాష్ట్ర నాయకుడు కే నాంచార్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని, గ్రామస్థులు, రైతులు ఇండోసోల్ పరిశ్రమకు మా భూములు ఇవ్వమని గ్రామ సభలో ప్రభుత్వ అధికారులకు స్పష్టంగా చెప్పినప్పటికీ పోలీస్ 30 యాక్ట్‌తో భయాందోళనకు గురిచేస్తు పొట్టేనుగుంట, రామకృష్ణాపురం ఎస్సీ కాలనీల్లో, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో పోలీసుల పర్యవేక్షణలో సర్వేలు నిర్వహించడం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

నేడు కూటమి పార్టీల ట్రాక్టర్ల ర్యాలీ

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులందరికీ తొలివిడత పెట్టుబడి సాయం విడుదలైన సందర్భంగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కందుకూరులో ట్రాక్టర్లతో రైతు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలతో పాటు రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

200 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 379 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 200 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-3, నోబిడ్-159, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 179 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.140, సగటు ధర రూ.197.69గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

బైక్ ఢీకొనడంతో వృద్ధురాలికి గాయాలు

అల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : బైకు ఢీకొని వృద్ధురాలికి గాయాలైన సంఘటన అల్లూరు చేపల మార్కెట్ ప్రాంతంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న వృద్ధురాలు తంగమ్మను ఢీకొని వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ఘటనలో తంగమ్మ కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ఆమెకు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి సీఎల్‌పురంలో అంధకారం

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురం కూడలిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం సాయంత్రం పేలడంతో గ్రామంలో అంధకారం నెలకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎప్పుడు రద్దీగా ఉండే కూడలో ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో పేలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

పేదరికం లేని సమాజమే పీ-4 లక్ష్యం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, పక్కన ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని నిర్మించటమే పీ-4 లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగులో ఉన్న కుటుంబాలను ఆదుకోవటం కోసం ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించారన్నారు. కావలి నియోజకవర్గంలో 9,000 పేద కుటుంబాలను గుర్తించారని, ప్రతి ఒక్కరూ పేద వర్గాలను ఆదుకునేందుకు వారికి మార్గదర్శకులుగా వ్యవహరించాలన్నారు. ఇప్పటి వరకు 1350 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. దేవుడి కన్నా మానవసేవ గొప్పదని, సమాజంలో సేవ చేసే వ్యక్తులకు గౌరవం లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, ప్రయివేట్ సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తే సమాజంలో పేదవారికి ఆదరణ లభిస్తోందన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

గుడ్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గుడ్లూరుకు చెందిన దామా వెంకటేశ్వర్లు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సొసైటీకి సంబధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, ఉన్నం వెంకటేశ్వర్లు, మేకల మాల్యాద్రి, రావూరి వేణు, చిత్తారి మల్లికార్జున, పువ్వాడి వేణు, జొన్నలగడ్డ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో తీరనున్న తాగునీటి సమస్య

● రూ.10 లక్షల మంజూరు ● పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



పైపులైన్ డిజైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ తదితరులు

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ముసునూరు 14, 15 వార్డులలో ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. దీనికి సంబంధించి మున్సిపల్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 10 లక్షలు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. త్వరలో పనులు చేపట్టనున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ బుధవారం మున్సిపల్ డీఈ సాయిరాంతో కలిసి ఆ ప్రాంతంలో పరిశీలించారు. మాగుంట పార్వతమ్మ లేఅవుట్ దగ్గర ఉన్న పెద్ద మంచినీటి బావిని, ముసునూరులో ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంకు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పైపులైన్ డిజైన్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ట్రంకు రోడ్డు విస్తరణలో భాగంగా ముసునూరులో నిర్మించిన డ్రైనేజీల కారణంగా మంచినీటి పైపులైన్ దెబ్బతినిందన్నారు. త్వరలో వాటి నిర్మాణాలు పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే ముసునూరులో మరో ఓవర్‌మెడ్ ట్యాంకు కూడా నిర్మించి ఉందని, దానికి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి ఆ ట్యాంకు కూడా నీరిచ్చి తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వినోద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం ప్రారంభానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న షమీమ్

కావలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి (మహిళల ఉచిత బస్సు ప్రయాణం) ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారిణి ఎస్‌కే షమీమ్ తెలిపారు. బుధవారం ఆమె కావలి డిపోను సందర్శించి అధికారులు, సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం దినోత్సవం రోజున ఈ పథకాన్ని కావలి డిపోలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రాంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డిపో మేనేజరు డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పనారెడ్డి, డీఈఈ ఎస్‌కే ఫయాజ్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర-ఆంధ్రపై అధికారులకు శిక్షణ

కొండాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్షర-ఆంధ్ర కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చే విధానంపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మండలలో 2600 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో మురళీధరరావు, ఏపీఎం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కావలి రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గుర్రంకొండ వెలుగు ఏపీఎం రజనిపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కావలి ఏపీఎం కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వెలుగు సిబ్బందిపై జరుగుతున్న దాడులకు నిరసనగా వెలుగు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కావలి క్లస్టర్‌లోని ఏపీఎంలు, సీసీలు బుధవారం వెలుగు కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి, బోగోలు, దగదర్తి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

బాలాజీసింగ్ కుటుంబానికి ఆర్థిక సాయం

కావలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దగదర్తి డిప్యూటీ తహసీల్దారు బాలాజీసింగ్ కుటుంబానికి ఏపీఆర్‌ఎస్‌ఏ కావలి డివిజన్ బాధ్యులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి సూచనల మేరకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేశారు. బాలాజీ సింగ్ ఉత్తర క్రియలు బుధవారం పట్టణంలోని కోఆపరేటీవ్‌కాలనీలో వారి నివాసం వద్ద జరిగాయి, ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కావలి డివిజన్ బాధ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి బాలాజీ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే ఇంటూరికి పీఏసీఎస్ చైర్మన్ల సన్మానం



ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్‌లు

కందుకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లకు రాష్ట్రప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలలో చైర్మన్లుగా నియమితులైన టీడీపీ నేతలు బుధవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుడ్లూరు పీఏసీఎస్ చైర్మన్‌గా దామా వెంకటేశ్వర్లు, పోకూరు పీఏసీఎస్ చైర్మన్ గట్టమనేని లక్ష్మీ నరసింహం, దారకానిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా నరాల మాలకొండారెడ్డిలు ఎమ్మెల్యేను కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎంపికైన పీఏసీఎస్ చైర్మన్లను సత్కరించారు. వారివెంట త్రిసభ్య కమిటీల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

బిట్రగుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను స్థానిక బీజేపీ నేతలు కోరారు. ఆపార్టీ బోగోలు మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్ యాదవ్‌ల ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు నెల్లూరుకు తరలి వెళ్లి జిల్లా పర్యటనకు వచ్చిన మాధవ్‌ను కలిశారు. బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి చేందేలా చూడాలని కోరుతూ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గోవిందరాజులు, బాలసుబ్రహ్మణ్యం, సూరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● **కందుకూరు** : రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నెల్లూరు పర్యటనలో పాల్గొనేందుకు కందుకూరు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలి వెళ్లారు. ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు నేతృత్వంలో అన్ని మండలాల అధ్యక్షులు, వివిధ కమిటీల బాధ్యులు, ముఖ్య కార్యకర్తలు ప్రత్యేక బస్సులో నెల్లూరు తరలి వెళ్లారు.

● **కావలి(టౌన్)** : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరులో జరిగిన సారథ్యం సభకు బీజేపీ ఒకటవ, రెండవ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో కావలి నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. అయితే వంద మందిలోపే తరలివెళ్లడంలో పార్టీలో లుకలుకలు బయటపడుతున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



ధర్నాలో మాట్లాడుతున్న చెంచయ్య

కావలి(టౌన్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చెంచయ్య పేర్కొన్నారు. కావలి డిపో వద్ద రెండవ రోజు బుధవారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ నిర్వీర్యమయ్యేలా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు జీవో ప్రకారం పిల్లల సంరక్షణ శెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శాఖ అధ్యక్ష కార్యదర్శి పీవీ రావు, టీఆర్ఎస్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి అబ్దుల్ కలాం, మీర్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ న్యాయనిర్ణేతగా కలిగిరి వాసి



గోసాల మహేష్

కలిగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువ ఆంధ్రకబడ్డీ సీజన్-1 న్యాయనిర్ణేత (రెఫరీ)గా కలిగిరికి చెందిన గోసాల మహేష్ ఎంపికయ్యాడు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలోని చెన్నుపాటి రామయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగే కబడ్డీ పోటీలకు రెఫరీగా వ్యవహరించే అవకాశం తనకు కల్పించిన ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, రెఫరీస్‌బోర్డ్ చైర్మన్ బీ.మురళీకుమార్‌లకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు మహేష్‌కు అభినందనలు తెలిపారు.


మహిళ మెడలో గొలుసు చోరీ

కొండాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పత్తిచేనులో పశువులమేత కొరకు వెళ్లిన యారవ లక్ష్మమ్మ కళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు కారంకొట్టి సుమారు నాలుగన్నర సవర్ల బంగారు గొలుసు అపహరించుకుని వెళ్లిన ఘటన మండలంలోని గరిమెనపెంట పంచాయతీ చల్లావారిపల్లిలో బుధవారం జరిగింది. బంగారు గొలుసు విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జీ.మాల్యాద్రి గ్రామానికి వెళ్లి విచారించి ఇద్దరు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టినట్టు సమాచారం.

క్షేత్రస్థాయిలో ప్రచారం చేయండి

(5వ పేజీ తరువాయి)

జరిగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలు ఉంటాయని నాయకులు, కార్యకర్తలు వాటిని ప్రజలకు తెలియజేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో ఎంతోమంది ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారని, వారి స్ఫూర్తితో పార్టీని ముందుకు నడిపించాలని కోరారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి ప్రత్యేక స్థానాలు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని, వాటిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కూటమిలో నామినేటెడ్ పోస్టులు బీజేపీకి గణనీయంగా పెరిగాయని, మరింతగా పెరగాలంటే కార్యకర్తలు ప్రజా నాయకులుగా మారాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో నెల్లూరుకు విమానాశ్రయం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకులు కూడా కార్యకర్తలకు అండగా నిలవాలని అన్నారు. సాయంత్రం ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో స్వర్ణకారులతో సమావేశమై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి అంజనేయరెడ్డి, రాజేశ్వరి, కమల, విల్సన్, భరత్‌కుమార్, రఘునాథరాజు, దయాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



త్రివర్ణ కాంతులతో కలెక్టరేట్





తిరుపతి కలెక్టరేట్ త్రివర్ణ పతాక విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. శుక్రవారం నాటి 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం రాత్రే లైటింగ్ ఏర్పాటు చేశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనమూ రంగురంగుల దీపపు కాంతులతో వెలుగులీనుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

చిన్నారులకు 'చెత్త' ఆఫర్



చెత్తనివ్వండి.. బహుమతులు తీసుకెళ్లండి.. అంటూ చిన్నారులకు తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ ఆఫర్ ఇచ్చింది. చాక్లెటు, బిస్కెట్లను తినేశాక ఆ ప్లాస్టిక్ కవర్లని రోడ్లపై పడేయకుండా పిల్లలను ప్రోత్సహించేలా ఈ నిర్ణయం తీసుకుంది. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ కార్యాలయంలోని గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చి బహుమతులు తీసుకెళ్లే విధానానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ కవర్లని తీసుకుని బహుమతిగా చాకెట్లు, పెన్నులు, పెన్సిళ్లను అందించడం ద్వారా బుధవారం ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ సునీల్, కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి రూరల్, ఆంధ్రజ్యోతి

తిరుపతి దక్షిణ దశ మారుతోంది

- వేగంగా ఎన్‌హెచ్ 716 విస్తరణ
- ఏడాదిన్నరలో అందుబాటులోకి..

6



● వర్షం ఎఫెక్ట్

ఎస్వీయూ స్టేడియంలో ఏర్పాట్లు.. ఏఆర్ పోలీసుల రిహార్సల్స్



ఎస్వీయూ స్టేడియంలో స్వాతంత్ర్య దిన వేడుకలు



● పోలీస్ పరేడ్ మైదానం బురదగా మారడంతో మార్పు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం జరిగే 79వ జిల్లాస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకులకు వేదిక మారింది. రెండు రోజుల వర్షానికి పోలీసు పరేడ్ మైదానం బురదమయంగా మారడంతో ఎస్వీయూ స్టేడియానికి మార్చారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు బుధవారం ఆదేశాలిచ్చారు. శుక్రవారమే కార్యక్రమం ఉండటంతో అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా అధికారులు స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసుల కవాతు, విన్యాసాలపై ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ రమణ నేతృత్వంలో రిహార్సల్ నిర్వహించారు. కాగా, వేదిక మార్పును గమనించి ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ఎస్వీయూ స్టేడియంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు కోరారు. ఇక, వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ఏర్పాట్లలో డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, గురువారం అతి భారీ వర్షం పడితే.. తుడాకు సంబంధించి కచ్చపి ఆడిటోరియంలోనైనా వేడుకలు నిర్వహించాలని యంత్రాంగం భావిస్తోంది.



ముఖ్య అతిథిగా మంత్రి ఆనం

ఎస్వీయూ స్టేడియం కేంద్రంగా జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా ప్రగతిపై సందేశమిస్తారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్ని శాఖల ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని జిల్లా తరఫున శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ అమరావతిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఆహ్వానించారు.

- తిరుపతి కలక్టరేట్, ఆంధ్రజ్యోతి

రేపు సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పథకం శుక్రవారం ప్రారంభంకానుంది. సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండులో సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత అన్ని జిల్లాల ప్రధాన బస్టాండ్లలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రారంభిస్తారు. సాయంత్రం 4-5 గంటల మధ్య ఈ-పాస్ యంత్రాలకు జీరో టిక్కెట్ జారీకి సంబంధించి గ్రీన్‌సిగ్నల్స్ లభించేలా చర్యలు చేపట్టారు. ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్సు వంటి రాష్ట్ర పరిధిలోని గుర్తింపు కార్డులను ఆధారంగా తీసుకుంటారు. వయస్సుతో నిమిత్తం లేకుండా జీరో టిక్కెట్ జారీ చేయనున్నారు. పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం సాయంత్రం గూగుల్‌మీట్ ద్వారా ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎండీ, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి. అన్ని విభాగాల సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని, అవసరమైన మేరకు డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచాలని, బస్టాండ్లలో మౌలిక సదుపాయాలకు కొరత రాకూడదని, భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలని, రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసు సాయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 11 మందికి జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం సంచలన తీర్పు చెప్పారు. ఇందులో ఆరుగురికి రెండు రోజులు, ఇద్దరికి మూడు రోజులు, మరో ముగ్గురు మందుబాబులకు ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. ఇక, 24 మంది మందుబాబులకు రూ.10,000 వంతున రూ.2.40 లక్షల జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపి జైలు శిక్ష పడిన 11మందిని చూసి మిగిలిన మం దుబాబులు గుణపాఠం నేర్చుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచ్చారి విజ్ఞప్తి చేశారు.

'ఆపరేషన్ సిందూర్' వ్యాసరచన పోటీల్లో

తిరుపతి వాసి విజేత



జగపతి సోమశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విధానాన్ని పునర్నిర్వించడం' అంశంపై భారత ప్రభుత్వ రక్షణ శాఖ జూన్ నెలంతా వ్యాసరచన పోటీలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా 20,557 మంది పోటీల్లో పాల్గొన్నారు. 200 మందిని విజేతలుగా ప్రకటించారు. ఈ విజేతల్లో తిరుపతి దామినేడుకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జగపతి సోమశేఖర్ ఒకరు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ప్రశంసా పత్రం అందుకోనున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఆహ్వానం అందింది.

వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ రవాణా కీలక పాత్ర పోషించాడా బడా నేత. ఇప్పుడూ ఆయన ఆధ్వర్యంలోనే గ్రావెల్ దందా మొదలైంది. అధికారం ఎటుంటే అటు వాలిపోయే కొందరు.. కూటమి ప్రభుత్వంలోనూ అక్రమ రవాణా సాగిస్తున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి



విటలయ్యపాళెం చెరువులో అక్రమ తవ్వకాలు

ఇప్పుడూ వాళ్లే..!

గోళ్లవారి కండ్రిగలో..




● సత్యవేడులో మళ్లీ మొదలైన గ్రావెల్ దందా

సత్యవేడు నియోజకవర్గంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొద్దికాలంగా నిలిపివేసిన మాఫియా మళ్లీ తమ కార్యక్రమాలను విస్తరిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో మట్టి మాఫియా రెచ్చిపోయి ప్రకృతి సంపదను ధ్వంసం చేసిన విషయం విదితమే. ఎర్రమట్టి, గ్రావెల్‌కున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకుని రూ.వందల కోట్లు లూటీ చేశారు. గ్రావెల్ అక్రమ రవాణా ఆపాలని అప్పట్లో ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశించినా అధికారులు మాత్రం నిబంధనలను అమలు చేయలేకపోయారు. ఫలితంగా నియోజకవర్గంలో రహదారులు ఛిద్రమై ప్రజలు ఇప్పటికీ ఆ బాధలు అనుభవిస్తూనే ఉన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రావెల్ తవ్వకాలకు విరామం ఏర్పడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇప్పుడు నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా కోరలు చాచేందుకు ప్రయత్నిస్తోంది. రెండు రోజులనుంచి వరదయ్యపాళెం మండలం విటలయ్యపాళెం చెరువులో, నాగలాపురం మండలం గోళ్లవారి కండ్రిగ ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలను సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రీ పగలు తవ్వి సరిహద్దు దాటిస్తున్నారు. రెండు మండలాల నుంచి భారీగా టిప్పర్లతో గ్రావెల్‌ను చెన్నైకు తరలిస్తున్నారు. వరదయ్యపాళెం మండలంలో గత ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించిన ఓ బడా వ్యక్తి తన పలుకుబడితో మళ్లీ గ్రావెల్ రవాణా సాగిస్తున్నాడని సమాచారం. నాగలాపురం మండలంలోను గతంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలో ఆరితేరి, వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఓ నాయకుడి కనుసన్నల్లో గ్రావెల్ తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు స్పందించడం లేదు. కాగా, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గ్రావెల్ టిప్పర్లను బుధవారం సాయంత్రం తడ సమీపంలో పోలీసులు దాడి చేసి పట్టుకోవడం గమనార్హం. దీనిపై వరదయ్యపాళెం తహసీల్దార్ సుధీర్‌రెడ్డిని వివరణ కోరగా మండలంలో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా ఈ పురస్కారాలను ఇస్తోంది. స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం,కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికిగాను కలెక్టర్ స్కోచ్‌కు ఎంపికయ్యారు.వచ్చే నెల 20న ఢిల్లీలో అవార్డు అందుకోనున్నారు. సీఎంచంద్రబాబు ప్రోత్సాహం, జిల్లా అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కలెక్టర్‌ను బుధవారం రాత్రి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్ఈ సురేంద్ర నాయుడు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.



శ్రీరామపురంలో ఇళ్ల మీద ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్



ముసురు మబ్బుల్లో తిరుమల


తిరుమలలో బుధవారం చిరు జల్లులు, చల్లగాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వానమబ్బులు కమ్మేసి తెల్లవారుజాము నుంచీ వాన కురుస్తూనే ఉంది. భక్తులు తడుస్తూనే తిరిగారు. సాయంత్రానికి చలి పెరిగింది. వరుస వానలతో కొండచరియలు జారే ప్రమాదం ఉన్నందున ఘాట్‌రోడ్లలోని కొన్ని ప్రాంతాల్లో విజిలెన్స్, ఫారెస్ట్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తిరుపతిలోనూ ఎడతెరపిలేని చిరుజల్లులు పడ్డాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్విమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ వైరాలజీ విభాగంలోని కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 6న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకాగలని రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్విమ్స్‌లోని పాత డైరెక్టర్ కార్యాలయ కమిటీ మందిరంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించే ఈ ఇంటర్వ్యూకు అభ్యర్థులు ఒరిజినల్, నకలు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. 40 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు.

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,596

తలనీలాలు సమర్పించినవారు: 31,565



తిరుపతి దక్షిణ దశ మారుతోంది

- వేగంగా ఎన్‌హెచ్ 716 విస్తరణ
- ఏడాదిన్నరలో అందుబాటులోకి..

మొత్తం రోడ్డ నిర్మాణం: 37.43కి.మీ
మల్లవరం నుంచి రేణిగుంట (కేఎల్ఎం సర్కిల్)దాకా: 17.40 కి.మీ
తమిళనాడు/ఏపీ సరిహద్దు పుత్తూరు సెక్షన్ : 20.03కి.మీ
ఇరువైపులా సర్వీస్ రోడ్డు దూరం: 32 కి.మీ
నిర్మాణ వ్యయం : రూ.862.11కోట్లు
నిర్మాణ సమయం: రెండు సంవత్సరాలు
పూర్తి చేయాల్సిన తేదీ :13-12-2026
నిర్మాణ సంస్థ: టీపీఎఫ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, వొయాన్స్ సొల్యూషన్స్ లిమిటెడ్

తిరుపతి నగరం దక్షిణ దిశగా విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరానికి దక్షిణంగా ఉన్న పల్లెల ప్రజలకు జాతీయ రహదారిని దాటడం అనే ప్రాణాంతక సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ఆరు వరసలుగా విస్తరణ జరుగుతున్న జాతీయ రహదారిపై కొత్త ఫ్లైవోవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఇందువల్ల రోడ్డు ప్రమాదాలకు అవకాశముండదు. ట్రాఫిక్ జామ్‌లు ఉండవు.

తిరుపతి-ఆంధ్రజ్యోతి

చిత్తూరు-నాయుడుపేట ఆరు లేన్ల రహదారిలో సి.మల్లవరం నుంచి రేణిగుంట కేఎల్ఎం కూడలి దాకా మాత్రమే నాలుగు లేన్ల రహదారి ఉండిపోయింది. దీన్ని కూడా ఆరు లేన్ల రహదారిగా విస్తరించే పనులు జోరుగా సాగుతున్నాయి. 17.40 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై కొత్తగా మూడు ఫ్లైవోవర్లు, 5 అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. సర్వీస్ రోడ్లు ఉంటాయి. 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' గా రూపుదిద్దుకుంటున్న ఈ జాతీయ రహదారి తిరుపతి నగర విస్తరణలో కీలక పాత్ర పోషించబోతోంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ 2024 నవంబరు 5న దీనికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి ఎన్‌హెచ్ 716గా నామకరణం చేశారు. ఇప్పటివరకు 11 శాతం పనులు పూర్తయ్యాయి. ఏడాదిన్నరలో పూర్తిగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విస్తరణ పనులతో పాటు రామానుజపల్లె, మల్లవరం వద్ద అండర్ పాస్ పనులు మొదలుపెట్టారు.

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే ప్రత్యేకతలు

వేగంగా, సురక్షితంగా వాహనాలు ప్రయాణించేలా ఈ హైవే నిర్మాణం జరుగుతోంది. హైవేను క్రాస్ చేసే అవసరం ఎక్కడా ఇక ఉండదు. హైవేకి సమాంతరంగా అటూ, ఇటూ సర్వీస్ రోడ్లు ఉంటాయి. హైవే మీదకు ఎక్కడానికీ, దిగడానికీ ఈ సర్వీస్ రోడ్లలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. పశువులు హైవే మీదకు వచ్చే వీలే లేకుండా బారికేడ్లు నిర్మిస్తారు.



గందరగోళం.. కేఎల్ఎం సర్కిల్



ఇక్కడ కూడా ఫ్లైవోవర్ వస్తుంది

మూడు ఫ్లైవోవర్లు

హైవేపై మూడుచోట్ల ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం కేఎల్ఎం ఆసుపత్రి కూడలి గందరగోళంగా ఉంటుంది. తిరుపతి నుంచి నాయుడుపేట వైపునకు వెళ్లే ఆరు వరసల హైవేలోంచి చెన్నైకి నాలుగు వరసల కూడలి చీలుతుంది. ఇదే కూడలిలో రేణిగుంట నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఇక్కడ ఎటు నుంచి ఎటు తిరగాలో అర్థంగాక వాహనదారులు గందరగోళపడుతుంటారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే మల్లవరం కూడలి కూడా ప్రమాదాలకు దారితీసేలా ఉంది. ఈ రెండు కూడళ్ల వద్దా ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. అలాగే అవిలాల క్రాసింగ్‌లో మరొక ఫ్లైవోవర్ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఆగిపోతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి.

ఐదు అండర్ పాస్‌లు

మల్లవరం కూడలి నుంచి కేఎల్ఎం కూడలి దాకా అనేక చోట్ల హైవేను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. ఆర్సీపురం, పచ్చికాపలం వరకూ ఉన్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇందుకు పరిష్కారంగా అడర్‌పాస్‌ల నిర్మాణం జరుగుతోంది.

- పేరూరు జంక్షన్, రామానుజపల్లె చెక్‌పోస్ట్ జంక్షన్‌లలో భారీ వాహనాలు సైతం వెళ్లేలా(వీయూపీ) అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.
- తనపల్లి క్రాస్, తిరుచానూరు జంక్షన్‌లలో కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా ఎల్‌వీయూపీ అండర్ పాస్‌లు నిర్మిస్తారు. ఇది 4.5 మీటర్ల ఎత్తు ఉంటుంది.
- ఎమ్మార్‌పల్లి - మల్లవరం రోడ్డులో ఉప్పరపల్లి జంక్షన్‌లో కార్లు, బస్సులు వెళ్లేలా (ఎస్‌వీయూపీ)అండర్ పాస్ నిర్మిస్తారు. ఈ అండర్‌పాస్ 5.5మీటర్ల ఎత్తు ఉంటుంది.



ఆదమరిస్తే అంతే.. తిరుచానూరు జంక్షన్



ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తారు



డేంజరస్ సర్కిల్.. ఈ తనపల్లి క్రాస్

టోల్ తప్పదు

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే మీదకు నగరంలో నుంచి ఎక్కాలనుకుంటే మాత్రం టోల్ ఫీజు చెల్లించాలి. ప్రస్తుతం హైవేపై మేర్లపాక వద్ద, పాకాల వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఇవి కాకుండా సర్వీస్ రోడ్డులోంచి ఎక్కే దగ్గర కూడా టోల్‌బూత్‌లు పెడుతారు. హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ల తరహాలో ఇవి ఉంటాయి. కింది ప్రాంతాల్లో టోల్‌బూత్‌లు ఉంటాయి. ఎంటర్ చేసిన ప్లాజా నుంచి ఎగ్జిట్ ప్లాజా వరకు ప్రయాణ దూరం ఆధారంగా టోల్ వసూలు చేస్తారు. రెండు బస్ షెల్టర్లు కూడా ఏర్పాటు చేస్తారు.

- తిరుపతి నుంచి మదనపల్లె వెళ్లే మార్గంలో సీ.మల్లవరం జంక్షన్ వద్ద
- శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వెళ్లే వైపు తొండమనాడు దగ్గర
- ఆర్సీపురం జంక్షన్ (అవిలాల క్రాస్) వద్ద
- గాజులమండ్యం జంక్షన్ (ఫ్లైఓవర్ కింద చెన్నై మార్గంలో)
- నగరి దగ్గర రెండు

ఈ కూడలి ప్రమాదకరం



ప్రస్తుతం హైవేల్లో మర్రిగుంట కూడలి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎయిర్ పోర్టు వైపునుంచి తిరుపతి వైపునకు వస్తున్నపుడు రేణిగుంట చెక్‌పోస్టు నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఈ కూడలి గందరగోళంగా ఉండడంతో వేగంగా ప్రయాణించే వాహనాలు హఠాత్తుగా ఎటు మళ్లాలో అర్థం కాక సడన్ బ్రేకు వేసి పల్టీలు కొడుతున్నాయి. ఇక్కడ సురక్షితమైన కూడలి గానీ, ఫ్లైవోవర్ గానీ అవసరం.

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నామని డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలను మాత్రమే యథావిధిగా కొనసాగిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, పక్కన ముఖ్య అతిథి రామస్వామి, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంతో భారత్ కీర్తి పెరిగిందని, ఈ విజయానికి గుర్తుగా ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాల్లో 7 చోట్ల ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ మాజీ కార్యదర్శి టి.రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ముత్త చెర్రియన్, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు ఉన్నత పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్

- దాతృత్వం చాటుకున్న ఎన్నారై వెంకటతేజ పేరం



ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు, వెంకటతేజ కుటుంబ సభ్యులు

పెళ్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విప్లవం నడుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రవాసాంధ్రుడు వెంకటతేజ పేరం అన్నారు. తన స్వగ్రామమైన పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెంకటతేజ యంగ్ మైండ్స్ ఏఐ హబ్ పేరుతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పేరం మధుసూదన్ నాయుడు, జ్యోతమ్మ, పేరం రమేష్‌నాయుడు, చంద్రబాబు నాయుడు, సందీప్‌తేజ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటతేజ వీడియో ద్వారా తన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. తాను పుట్టిన ఊళ్లో విద్యార్థులు ఏఐ టెక్నాలజీపై అవగాహన పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంలో యంగ్ మైండ్స్ ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా కృతిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) రోబోటిక్స్, కోడింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా సైన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందిస్తామన్నారు. తద్వారా సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యం పెరిగి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే అవకాశం లభిస్తుందన్నారు.ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన తన స్నేహితులు కార్తిక్‌రాజు, నిమిష్, వసంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులు ఏఐ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో రాణించాలని పేరం సోదరులు ఆకాంక్షించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, నాయకులు గాలి రాజేష్ నాయుడు, విజయ్‌కుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు,భైనా చంద్రశేఖర్‌రెడ్డి, అక్కరపల్లి గోపాల్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, మునీష్, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

గజదాడుల నివారణకు ప్రణాళిక రూపొందించండి

- తలకోనలో అధికారులకు కలెక్టర్ ఆదేశం



ఎర్రావారిపాలెం, ఆగస్టు 13; పంట పొలాలపై ఏనుగుల దాడుల నివారణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందిచాలని అటవీశాఖ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అదే సమయంలో ఏనుగుల రక్షణ ముఖ్యమన్నారు. వన్య ప్రాణులు, అటవీ సంరక్షణకు సంబంధించి బుధవారం ఆయన తలకోనలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అడవుల్లో వన్య ప్రాణుల రక్షణకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. అటవీ,వన్య ప్రాణుల చట్టలను కఠినంగా అమలు చేస్తూ మరోపక్క పంట పొలాలపైకి ఏనుగుల దాడుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం జరగకుండా, రైతులు ప్రాణాలు కోల్పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ వివేక్, సీసీఎఫ్ఓ సెల్వం, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మూషిక వాహనంపై గణనాథుడు



పాకాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహోత్సవాలు బుధవారం ఉదయం శ్రీకారం చుట్టుకున్నాయి. ఉభయదారులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం కలశ స్థాపన హోమం జరిగింది. రాత్రి వినాయకస్వామి మూషికవాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. అయిదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 17న జరిగే ఉత్సవానికి భారీగా భక్తులు తరలిరానున్నారు.

ఇంటి సమీపానికి ఒంటరి ఏనుగు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు పెరట్లోకి రావడంతో ఆ కుటుంబ సభ్యులు వణికిపోయారు. ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ చిన్నరామాపురానికి చెందిన సల్లకుంట్ల సుధాకర్ నాయుడికి ఊరికి ఆనుకొని పొలం ఉంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి పక్కనే వున్న పశువుల నీటి తొట్టిలో ఓ ఏనుగు నీరు తాగుతుండటం చూసి ఆ రైతు తీవ్రభయాందోళన చెందారు. ఆయన కుమారుడు ధైర్యంగా వెళ్లి ఇంటి ఆవరణలోని ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి హారన్ మోగించడంతో గజరాజు నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోయింది. అప్పటికే చెరకు, టమోటా, కూరగాయల పంటలను తిని ధ్వంసం చేసింది. ఫారెస్టు అధికారులు ఏనుగుల సంచారం ఇవ్వడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొట్టిలో నీరు తాగి వెళ్లిపోతున్న ఏనుగు

ఉచిత ఇసుక విధానం భేష్

- పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు



గరుడ సర్కిల్ వద్ద కుటుంబ సభ్యులతో పెనుమత్స

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం లోడింగ్, రవాణాలకు నామమాత్రంగా ఛార్జీలను తీసుకుంటూ ఉచితంగా ఇసుకను అందించడం గొప్ప విషయమని ఎస్ఎల్‌వీ గ్రూప్ అధినేత పెనుమత్స శ్రీనివాసరాజు కొనియాడారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఏటా పాదయాత్రగా తిరుమల వస్తానని మొక్కుకున్న ఆయన క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13న విజయవాడలో పాదయాత్ర ప్రారంభించి బుధవారం అలిపిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షలా మారిందన్నారు. ఫలితంగా నిర్మాణాలు నిలిచిపోయి అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం రూ. 200 లోడింగ్, రవాణా ఛార్జీలతోనే ఇసుక అందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పదిరోజుల క్రితం చేపట్టిన పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసి శ్రీవారి వద్దకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

రుయాకు బ్రోన్కోస్కోప్ వితరణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యశోదా ఆస్పత్రుల ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ హరికిషన్ రుయాస్పత్రిలోని పల్మనాలజీ విభాగానికి రూ.5 లక్షల విలువచేసే బ్రోన్కోస్కోప్‌ను అందించారు. బుధవారం రుయాలో ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధలకు దాన్ని అప్పగించారు. రుయాస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు ముందుకు రావడం చాలా గొప్ప విషయమని వారు పేర్కొన్నారు. ఇటువంటి ఖరీదైన వైద్య పరికరాలతో శ్వాసకోశ వ్యాధులను ముందుగానే గుర్తించి, వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, వైద్యాధికారులు మధుసూదన్, మనోహరన్, అజయ్‌కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లకు బ్రోన్కోస్కోప్‌ను అందజేస్తున్న వైద్యులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం: కురుగొండ్ల



శేషగిరి రావుకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు

వెంకటగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి రావుకు మాధవ నాయుడు తమ ఐటీఎం ట్రస్టు ద్వారా రూ.1.60 లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే కురుగొండ్ల కూడా కొంత నగదు అందించారు. అనంతరం ముప్పాళ్ల శేషగిరి రావును, నరసయ్య నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్లయిండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పరుచూరు నరసయ్య నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాస్ గంగాధరం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరావు, వెంకటగిరి మండల టీడీపీ అధ్యక్షుడు మురళి, లింగసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడు రంగినేని రాజా, పెరిమిడి మాజీ పర్వంచ్ మురళి, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, గోల్లపల్లి సొసైటీ డైరెక్టర్ పావులూరు భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం: విజయశ్రీ

నాయుడుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముఖ లాంటి అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన నేపథ్యంలో బుధవారం నాయుడుపేటలో నాయకులు, రైతులు భారీ ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో ఉన్న విజయగణపతి దేవస్థానం నుంచి అంబేడ్కర్ విగ్రహం, శ్రీకాళహస్తి బైపాస్ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, జనసేన ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనరు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, అరవ పెరిమిడి చంద్రారెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, ఆకుతోట రమేష్, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, ఫైలారి రాజశేఖర్, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, మెండెం బాబు, సుజాతమ్మ పాల్గొన్నారు.

కురుగొండ సొసైటీ కమిటీ బాధ్యతల స్వీకారం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఓజిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) త్రీమెన్ కమిటీ బుధవారం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా దారా అంకయ్య, డైరెక్టర్లుగా కొండూరు రవీంద్రరాజు, అలిమిలి మల్లిఖార్జున్‌రెడ్డిను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరికి సీఈవో రవి బుధవారం బాధ్యతలు అప్పగించారు. చైర్మన్, సభ్యులను టీడీపీ నాయకులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన వెంకయ్య మోటారు సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకయ్యను నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రపు నాచుమొక్కల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధి



నాచుమొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న రాజేష్

వాకాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచుమొక్కల పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ తెలిపారు. మండలంలోని కొండూరుపాళెంలో మత్స్యకారులకు బుధవారం సముద్ర నాచుమొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆదాయ మార్గాలను కల్పించి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు తీర ప్రాంతాల్లో సముద్ర నాచుమొక్కల పెంపకం జీవనోపాధి మార్గంగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రెడ్డినాయక్, సందీప్, యశ్వంత్, టీడీపీ నాయకులు దోసకాయల కృష్ణమూర్తి, కుంచెం దయాకర్, కల్లూరు హరీష్ నాయుడు, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, మత్స్య సంఘం నాయకుడు పూడి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుమార్తెకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

డక్కిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చీర్ల అయ్యపరెడ్డి కుమార్తె అనూషారెడ్డి వివాహం బుధవారం జరిగింది. ఆమెను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆశీర్వదించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, మురళి తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలి

నాయుడుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఇంటా పండుగలా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. బుధవారం స్థానిక గాంధీ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ఫజులాల్లా తదితరులు

గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరదయ్యపాళెం మండలం విట్టాలాయపాళెం నుంచి చెన్నైకు టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలివెలుతున్న సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. బుధవారం రాత్రి భీములవారిపారిపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు, మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నైకు గ్రావెల్ తీసుకుకెళ్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు. కాగా, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల టీడీపీ నేతల మధ్య ఆదిపత్య పోరే గ్రావెల్ టిప్పర్లు పట్టుబడడానికి కారణమని తెలిసింది.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన: పాశం

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనను అందిస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మసీదు వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి పథంలోకి నడిపిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల ఆదరణను పొందుతోతుందని చెప్పారు. ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్ల పునరుద్దరణ, ఉచిత గ్యాస్ సిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని ప్రారంభించనుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, నాజర్, జహంగీర్, సద్దాం, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజల ముందుకు: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు 'గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు బాపూజీ కాలనీలో ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామని అక్కడ ప్రజలకు తెలియజేశారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. డ్రైనేజీ కాలువలను నిర్మించి, శ్మశాన వాటికను కూడా ఏర్పాటు చేస్తామని, అలాగే తాగునీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా, ఉదయం నుంచే తేలికపాటి జల్లులు పడుతున్నా ఎమ్మెల్యే వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, నాయకులు అలవల శ్రీనివాసులు, మేడా సాయినారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



బాపూజీ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

చెరువు అభివృద్ధికి చర్యలు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో చర్యలు చేపట్టినట్లు నీటి సంఘం అధ్యక్షుడు హేమకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం చెన్నూరు చెరువులో నేలమడుగు వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువు ఆయకట్టు కింద వెయ్యికి పైగా ఎకరాల్లో చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయం సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. నేలమడుగు వద్ద నీరు వృథా అవుతుండడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు.

గోకులకృష్ణలో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గూడూరు ఏరియా ఆస్పత్రి, ఏపీ వైద్య విధాన పరిషత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 60విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస బాబా, ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏవో మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర



పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువెళుతున్న గ్రామస్తులు

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తడలో పోలేరమ్మ జాతర బుధవారం మొదలైంది. ఉదయం పోలేరమ్మ బండ వద్ద గ్రామస్తులంతా అంబళ్లను తీసుకువచ్చి నైవైద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పోలేరమ్మ సోదరి చల్లాతమ్మకు పొంగళ్లు పెట్టారు. రాత్రి పోలేరమ్మ, పోతురాజు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరింపజేసి గ్రామోత్సం నిర్వహించారు.

ఫ్లెక్సీల తొలగింపు

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు సూళ్లూరుపేటలో ఆగస్టు 15న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పట్టణంలో పలుచోట్ల భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలను మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా తొలిగించారు. చిరంజీవి యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్ కుమార్ శర్మ మాట్లాడుతూ మున్సిపాలిటీ అధికారులు ఏకపక్షంగా ఫ్లెక్సీలు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను అలాగే ఉంచి సేవా కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించడాన్ని ఖండించారు. దీనిపై కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా సెంటర్ లైట్ విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టరాదని, అందుకే తొలిగించామన్నారు.

రెండో రోజూ కొనసాగిన ధర్నా

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద బుధవారం రెండోరోజు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి గ్రాట్యుటీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో వెంకయ్య, వెంకటేశ్వర్లు, భాషా, ప్రవీణ్, కృష్ణ, పోలయ్య, చక్రపాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీతో జీలుగలు

ఓజిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు 50 శాతం రాయితీతో జీలుగలు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వరప్రసాద్ తెలిపారు. 26 పంచాయతీలకు మొదటి విడతగా 25 టన్నులు, రెండవ విడతగా 19 టన్నుల జీలుగలు వచ్చాయని తెలిపారు. కిలో జీలుగలు రూ.123 కాగా 50 శాతం రాయితీతో రూ.61.50 చెల్లించాల్సి వుంటుందన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్, ప్రధాని నరేంద్రమోదీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి ప్రపంచ దేశాలే గౌరవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు గౌడ్, వెంకటరామయ్య, మోహన్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

గూడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని కన్యకా పరమేశ్వదేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి వాసవి మహిళా సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ



చిల్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో బుధవారం శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. గ్రామానికి చెందిన మిద్దె నాగయ్యశెట్టి, శ్రీదేవి సహకారంతో ఋణ విమోచన శ్రీకృష్ణ మందిరం నిర్మించి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమా ల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బాలకృష్ణమ నాయుడు, మిద్దె నాగయ్య, శ్రీదేవి, యశ్వంత్, ఇంద్రసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచడానికే ఉల్లాస్

వాకాడు, ఆగస్టు, 13 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాసులకు అక్షరాలు నేర్పించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. వలంటీర్లు గ్రామాల్లో నిరక్షరాసులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పోలమ్మ, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై శిక్షణ

బాలాయపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని వీవోఏలకు అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వినీల్‌కుమార్ మాట్లా డుతూ ప్రతి వీవోఏ వారి పరిధిలోని నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, ఏపీఎం కిరణ్, ఏపీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి: ఆరుగురి అరెస్ట్

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని అంబేద్కర్ గురుకులం సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఎస్‌ఐ పవన్‌కుమార్ దాడులు జరిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.6,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డీఎల్‌డీవో వాణీరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వమిత్వ, ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని, అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో వేణు, అధికారులు పాల్గొన్నారు.

గూడలి సర్పంచి ప్రత్యక్షం

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి సర్పంచి ఉడపల ఆదెమ్మ బుధవారం ప్రత్యక్షం కావడంతో తహసీల్దారు జయజయరావు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. జూన్ 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆదెమ్మ అదృశ్యమయ్యారు. ఆమె భర్తతో పాటు పంచాయతీ అధికారులు పోలీసుకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల తరువాత ఆదెమ్మ ప్రత్యక్షం కావడంతో తహసీల్దారు జయజయరావు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇళ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

వాకాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల సర్వేని పకడ్బందీగా చేయాలని డీడీవో వాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలం కార్యాలయంలో ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష చేపట్టారు. మ్యాప్‌లను పరిశీలించారు. కొండూరు, మొలగనూరు, రెడ్డిపాళెం గ్రామాల మ్యాప్‌ల సమగ్ర భూసర్వేల్లో ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలని సూచించారు. అలాగే తడిచెత్తను, పొడిచెత్తను వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెళ్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని చిల్లకూరు, పుల్లూరు గ్రామాల్లో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతి ఆచరించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు చావాలి పంచాయతీలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో విజయభారతి, వీఏఏ మహేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్

నేడు, ఎల్లుండి, సోమవారం పలు రైళ్ల రద్దు

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలో పొన్నేరి, కవర్‌పేట రైల్వేస్టేషన్ మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో 14, 16, 18 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు బుధవారం సాయంత్రం ప్రకటించారు.

రద్దైన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9.00గంటలకు నడిచే ఈఎంయూ, మెమో రైళ్లు
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30, 11.35 గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40 గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 10.55 గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైలు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి మధ్యాహ్నం 12.00, 2.30, 3.15గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఆవడికి రాత్రి 11.40గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు
- చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55 నిమషాలకు బయలుదేరి వచ్చే ఈఎంయూ లోకల్ రైలును చెన్నై బీచ్ వరకు నడపనున్నారు.
- గుమ్మిడిపూడి నుంచి తాంబరానికి మధ్యాహ్నం 3.00 బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు చెన్నై బీచ్, తాంబరం మధ్య నడపనున్నారు.

ప్రత్యేక రైళ్లు...

- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరికి ఉదయం 10.30గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైలు నడవనుంది.
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి మీంజూరుకు ఉదయం 11.35 నిమషాలకు ప్రత్యేక రైలు
- చెన్నై బీచ్ నుంచి పొన్నేరికి మధ్యాహ్నం 12.40 నిమషాలకు ఈఎంయూ ప్రత్యేక రైలు
- పొన్నేరి నుంచి చెన్నైమోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.18 ఈఎంయూ ప్రత్యేక రైలు
- మీంజూరు నుంచి మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 2.59 నిమషాలకు ఈఎంయూ ప్రత్యేక రైలు
- పొన్నేరి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 3.30 నిమషాలకు ఈఎంయూ ప్రత్యేక రైలు నడవనుంది.

పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సుబ్బారావు



నాయుడుపేటటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా నానాబాల సుబ్బారావును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బాబు, మంజుల, శిరీషా, హైమావతి, నర్మద, సురేష్, సుబ్బులక్ష్మీ, రవీంద్ర, మునిసురేష్‌లను సభ్యులుగా నియమించారు.

కమనీయం సంగమేశ్వరుడి కల్యాణం



సంగమేశ్వరుడు, కామాక్షీదేవి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల సంగమేశ్వరాలయ ప్రాంగణంలోని కామాక్షీదేవి కుంబాభిషేకంలో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉభయకర్తలు రాకేష్‌చౌదరి కుటుంబ సభ్యులు అనసూయమ్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కార్తీక్‌శర్మ, వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. అంతకుముందు కామాక్షీదేవి విగ్రహాన్ని పతిష్టించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి వచ్చిన భక్తులకు నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

వీల్ చైర్ అందజేత



తేజస్‌కు ఎలక్ట్రిక్ వీల్‌చైర్ అందజేస్తున్న టీడీపీ నాయకులు, దాతలు

కోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురానికి చెందిన మానసిక వికలాంగుడు తేజస్‌కు చెన్నైకి చెందిన గిరిధర్‌రెడ్డి దాతృత్వంతో రూ.49వేల విలువచేసే ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను షిరిడిసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, కోటమ్మ ఆలయ చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దాత గిరిధర్‌రెడ్డితో పాటు అక్షయ సేవాసమితి ప్రతినిధులు కోటేశ్వరరెడ్డి, సుబ్బయ్య, పన్నగ సాయి, బాబూరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్బారావు, శరవణ, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

తడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్షకు అర్హలవుతారని ఎస్‌ఐ కొండప్పనాయుడు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం తడ బజారు కూడలిలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడిపినా, అనుమతిలేని ప్రదేశాల్లో పార్కింగ్ చేసినా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.